IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com
https://epaper.suryavastavam.com

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

సోమవారం | 17 జూన్ 2024 | తిరుపతి

సంపుటి 1 | సంచిక 13
పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



"సూర్యా వాస్తవం పాత్రికేయులకు, పాఠకులకు , ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు"
-సూర్యా వాస్తవం యాజమాన్యం

## మూడు వారాల్లో అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తాం

### -పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



అమరావతి, సూర్యా వాస్తవం: నిరుపేదలకు కేవలం రూ.5/- లకే ఉదయం టిఫిను, రూ.5/- లకే మద్యాహ్న భోజనం మరియు రూ.5/- లకే రాత్రికి భోజనం అందజేసే అన్నా క్యాంటీన్లను మూడు వారాల్లో పునరుద్దరిస్తామని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వెగలపూడి రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ఉదయం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్నా క్యాంటీన్ల పునరుద్దరణపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా చేసిన ఐదు సంతకాల్లో అన్నా క్యాంటీన్ల పునరుద్దరణ ఫైల్ కూడా ఉందన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 203 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినప్పటికీ 184 క్యాంటీన్లను ప్రారంభించగా మిగిలిన 19 క్యాంటీన్లు నిర్మాణ దశలో ఉండిపోవడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ కేంద్రాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిరుపేదలకు కేవలం రూ.5/- లకే ఉదయం టిఫిను, రూ.5/- లకే మద్యాహ్న భోజనం మరియు రూ.5/- లకే రాత్రికి భోజనం అందజేసే అన్నా క్యాంటీన్ల వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అయితే నిర్వీర్యం అయిపోయిన అన్నా క్యాంటీను పునరుద్దరించేందుకు అవసరమైన మరామత్మలు చేసేందుకు అంచనాలను రెండు మూడు రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. గతంలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను ఇస్కాన్ ఆధ్యాత్మిక సంస్థకు అప్పగించడం జరిగిందని, మూడు పూట్లా ఆహారం అందజేసేందుకు రోజుకు రూ.73/- లను చార్జి చేయడం జరిగిందన్నారు. అయితే అన్నా క్యాంటీన్ల ద్వారా రోజుకి కేవలం రూ.15/- లకే మూడు పూట్లా ఆహారం అందజేస్తూ మిగిలిన రూ.58/- లను 3లో

## కేన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

### రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, జూన్ 16 (సూర్య వాస్తవం): కేన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖ మంత్రిగా సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిమ్స్ తరహాలో మెరుగైన వైద్య సేవలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగు పర్చడంతో పాటు సిబ్బందికూడా సమకూర్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఆదివారం ఉదయం 10.20 గంటల సమయంలో వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల్లో అత్యధికంగా కేన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని, ప్రతి ఏదాది సగటున 48 వేల మంది కేన్సర్ మహమ్మారి బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఓరల్, బ్రెస్టు, సర్వైకల్ కేన్సర్ల 3లో

## చంద్రబాబు పోలవరం సందర్శన ..
## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి రామానాయుడు




జంగారెడ్డిగూడెం సూర్యా వాస్తవం: : ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో ప్రాజెక్టు వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సీఎం.. పోలవరం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత అధికారులతో మంత్రి సమీక్షించారు. నిర్మాణ పనుల్లో ప్రతి అంశాన్ని చంద్రబాబు పరిశీలిస్తారని, అనంతరం అధికారులతో సమీక్షిస్తారని రామానాయుడు వెల్లడించారు. ఐటీడీఏ పీవో సూర్య తేజ, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఇతర శాఖ అధికారులు పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని అధికారులకు సీఎం పర్యటన నేపథ్యంలో పలు సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం మొదటిసారి పోలవరం ప్రాజెక్టు సందర్శనకు విచ్చేస్తున్న నేపథ్యంలో.. పర్యటనకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రాజెక్టు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేసి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు.

## రెండో రోజూ నారా లోకేష్ "ప్రజాదర్బార్"

### -యువనేతను కలిసి సమస్యలు విన్నవించిన మంగళగిరి ప్రజలు



మంగళగిరి, సూర్యా వాస్తవం: మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చిన విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రెండో రోజూ "ప్రజాదర్బార్" నిర్వహించారు. ఉండవల్లిలోని నివాసంలో యువనేత స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. "ప్రజాదర్బార్" కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుంచి విశేషమైన స్పందన వచ్చింది. పెద్దఎత్తున తరలివచ్చి తమ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. డీఎస్సీ-2008, జీవో నెం.39 ప్రకారం ఎంటీఎస్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 2,193 మందిని రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యువనేతను కలిసి విన్నవించారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ సక్రమంగా చెల్లించనందున తన పాలిటెక్నిక్ సర్టిఫికెట్లను నూజివీడు కాలేజీ నుంచి 3లో

## రబీ సీజన్ లో కరవు పరిస్థితిని పరిశీలించేందుకు ఏపీకి వస్తున్న కేంద్ర బృందం



అమరావతి, సూర్యా వాస్తవం: ఏపీలో రబీ సీజన్‌లో నెలకొన్న కరవు పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందం రాష్ట్రానికి రానుంది. రితేశ్ చౌహాన్ నేతృత్వంలోని కేంద్ర బృందం ఏపీలో కరవు పరిస్థితులను పరిశీలించనుంది. కరవు జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన మంగళవారం నుంచి శుక్రవారం వరకు సాగనుంది. ఈ బృందంలో 10 మంది సభ్యులు ఉన్నారు. వీరు మూడు చిన్న బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకోనున్నారు. కేంద్ర బృందం ప్రకాశం, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, శ్రీ సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో పర్యటించనుంది.

## 19న పవన్ కల్యాణ్ పదవీ బాధ్యతల స్వీకరణ

అమరావతి, సూర్యా వాస్తవం: జనసేనాని పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా నియమితులైన సంగతి తెలిసిందే. ఆయనకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలు కేటాయించారు. కాగా, పవన్ కల్యాణ్ పదవీ బాధ్యతల స్వీకరణకు ముహూర్తం ఖరారైంది. జూన్ 19న పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి జయకేతనం ఎగురవేశారు. వైసీపీ అభ్యర్థి వంగా గీతపై 70,279 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి 164 స్థానాలు రాగా, వైసీపీకి 11 స్థానాలు దక్కాయి. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులుగా 24 మంది ప్రమాణం చేశారు. మంత్రులు ఒక్కొక్కరుగా బాధ్యతలు చేపడుతున్నారు.




## జమ్మూకశ్మీర్ శాంతిభద్రతలపై కేంద్ర హెూంమంత్రి కీలక సమీక్ష




న్యూఢిల్లీ జూన్ 16 (సూర్య వాస్తవం) :ఇటీవల ఉగ్రవాద దాడి ఘటనల నేపథ్యంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వారం వ్యవధిలోనే నాలుగు ఉగ్రదాడులు జరగ్గా, ఇప్పుడు అమర్‌నాథ్ యాత్ర వస్తుండడంతో ఆ మేరకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అమిత్ షా చర్చించారు. ఈ సమావేశం దాదాపు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. టెర్రరిస్టులు భారత భూభాగంలోకి చొరబడేందుకు ఉపయోగిస్తున్న సొరంగ మార్గాలను గుర్తించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్థానిక నిఘా వ్యవస్థలను బలోపేతం చేయాలని అమిత్ షా సూచించారు. డ్రోన్ చొరబాట్లను కూడా సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు. జీరో టెర్రర్ ప్లాన్ తో కశ్మీర్ లోయలో ఎలా శాంతి నెలకొందో, అదే ప్రణాళికను జమ్మూ ప్రాంతంలోనూ అమలు చేయాలని నిర్దేశించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు మోదీ సర్కారు సరికొత్త మార్గాలను అవలంబిస్తుందని తెలిపారు. జమ్మూకశ్మీర్ లో సైన్యం, పారామిలిటరీ బలగాలు పరస్పర సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని అమిత్ షా స్పష్టం చేశారు. భద్రతా పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదంపై పోరు ప్రస్తుతం నిర్ణయాత్మక దశలో ఉందని, ఈ స్థితిలో ఉదాసీనంగా వ్యవహరించరాదని సూచించారు. ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే... ఉగ్రవాద చర్యలు భారీ హింసాత్మక ఘటనల నుంచి చిన్నా చితకా దాడుల స్థాయికి పడిపోయాయని, వీటిని కూడా నిర్మూలించడానికి తాము కృతనిశ్చయంతో ఉన్నామని అమిత్ షా ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, భారత్ తదుపరి ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, కేంద్ర హెూం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, కేంద్ర నిఘా సంస్థ డైరెక్టర్ తపన్ దేకా, సీఆర్పీఎఫ్ డీజీ అనీశ్ దయాళ్ సింగ్, బీఎస్ఎఫ్ డీజీ నితిన్ అగర్వాల్, జమ్మూకశ్మీర్ డీజీపీ ఆర్ఆర్ స్వైన్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# త్యాగనిరతని, దానగుణాన్ని నేర్పే పండుగ

# "ఈదుల్ అజ్హా" బక్రీద్ పండుగ



**సూర్య వాస్తవం ప్రత్యేక ప్రతినిధి :** త్యాగాలకు ప్రతీక దానగుణం పెంపొందిచే పండుగ "బక్రీద్""ఈదుల్ అజ్హా"పవిత్రత దాని ప్రయోజనాల గురించి రాష్ట్రమైనార్టీ నాయకులు యన్.ఆరీఫ్ అలి సూర్య వాస్తవంతో పంచుకున్నారు. ఈ సందర్భంగా బక్రీద్ పండుగ సగటు మనిషిలో దానగుణాన్ని,మాటమీద కట్టుబడి వుండటం, దైవ మార్గంలో ఎటువంటి త్యాగాలకైనా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగడం నేర్పుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఎంతో మందికి ఆదర్శంగా. తీర్చిదిద్దే పండుగ బక్రీద్. "హజరత్ ఇబ్రాహీం అలైహిస్సలాతు వస్సలాం" గారి సున్నత్ పద్ధతి ఖుర్బాని దాని కొనసాగింపు చివరి ప్రవక్త ముహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లెమ్ గారు అల్లాహ్ ఆదేశంతో ప్రతి ముస్లిం ఎవరైతే ఆర్థిక స్థోమత"సాహిబే ఇస్తెతాత్" కలిగి వుంటారొ అటు వంటి ప్రతి ముస్లిం పై ఖుర్బాని "వాజిబ్"ఖచ్చితంగా పాటించవలసిన అల్లాహ్ ఆదేశం. బక్రీద్ పండుగలో పవిత్ర యాత్ర "హజ్" మరియు "ఖుర్బాని" రెండు ముఖ్యమైన ప్రార్ధనలు. హజ్ యాత్ర కొసం సౌదీలోని పవిత్ర మక్కా మరియు మదీన నగరాలకు వెళుతారని కాని ఖుర్బాని కొసం ఎక్కడికీ వెళ్ళే అవసరం లేకుండా తమనివాస స్తలాలలొ చేసుకుంటారు. పండుగంటే కేవలం కొత్త బట్టలేసుకొని మంచి వంట కాలు చేసి జంతువుల ఖుర్బాని ఇవ్వడం మాత్రమే కాదు. ఈ పండుగ ద్వారా మనిషిలో త్యాగ గుణం పెంపొందించడం ముఖ్య ఉద్దేశం. భగవం తుని ఆదేశానుగుణం మనిషి తనకిష్టమయిన ప్రీతి పాత్రమైనవాటినిత్యాగం చేయాలి అలాగే తనలొని చెడునుత్యజించే గుణం అలవరచు కోవాలి. బక్రీద్ పండుగ సందర్భంగా చేసే ఖుర్బాని గురించి దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు కులమతాల కతీతంగా జరిగే ఆర్థిక లాభం చేకూరుతుంది. అదే సమయంలో కొంతమంది మంది మతఛాందవాదులు తమ రాజకీయ మనుగడ కొసం కొన్ని అనవసరమైన అవాస్తవమైన అపోహలు సృష్టించడం జరుగుతుందని వాటి వాస్తవాలను వివరించి వాటిని నిర్వీర్యం చేయాలని పిలుపునిచ్చారు.

### "బక్రీద్" సందర్భంగా రైతులకు, పేదప్రజలకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు..

– సుమారు ఖుర్బాని జంతువుల విక్రయాలద్వార, పేద రైతులకు యేటా ఏడు లక్షల యాభై వేల కోట్ల రూపాయలకు పైగా లబ్ధి.



ఎన్.ఆరిఫ్ అలి.. 8074010854

-ముప్పై లక్షల రైతులకు ప్రతి సంవత్సరం జీవనోపాధి. సగటు. ఒక్కొరైతు. పది మేకలు పెంచి అమ్మితే ఒక్కొక్కటి కనీసం25,000 రూపాయలకు విక్రయిస్తే ఒక్కొ రైతుకు రెండు లక్షల యాభై వేల రూపాయలు ఆ ప్రకారం ప్రతినెల 20 వేల రూపాయలు. ఇక రైతు ఆత్మహత్య చేసుకునే దౌర్భాగ్యం వుండదు...పరోక్షంగా వారపు సంతల ద్వారా రైతులకు. దలారులకు ,చిల్లర వ్యాపారులకు,కటిక వృత్తితొ జీవనోపాధి జరుపుకునే వారికి. జంతువుల చర్మాల వ్యాపారులు .లెదర్ ఇండస్ట్రీ ఇలా చెప్పుకుంటూ పోతే దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా కనీసం పది లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ ద్వారా లబ్ది చేకూరుతుంది..అత్యధికశాతం రైతాంగం హిందూ సొదరులే లబ్ది పొందుతారు.వీటన్నికి తోడుగా ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి, ఓట్ల కోసం పనికి రాని రాయతీలు . విగ్రహాల ఏర్పాట్లు.ప్రచార ఆర్భాటం కొసం వేల కోట్ల రూపాయలు వృధా చేసుతున్నారు దానికి బదులు ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా 30 లక్షలమంది రైతుకుటుంబాలకు ఒక్కొక్కరికి 10 మేక లేదా గొర్రెపిల్లలను వుచితంగా లేదా సబ్సిడీ రూపంలో చేయూతనిస్తే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొని. దేశం అభివృద్ధి పథంలో ముందుకెళ్ళడానికి సహాయపడు తారు. దేశానికి వెన్నుముక .అన్నం పెట్టే అన్నదాతలు . అప్పుల వూబిలొ పడి ఆకలి చావులు ఆత్మహత్యలు చేసుకొకుండా కొంత మేరకైనా ఆపగలం..అందుకు బక్రీద్ పండుగ తోడ్పాటునిస్తుంది.

### ఇక అపోహలు .. వాటి వాస్తవాలు..

ఇలాంటి పండుగను కూడా తమ స్వార్ధ రాజకీయలబ్ది కోసం వాడుకునే క్రమంలో లేని పోని అపోహలు సృష్టించడం జరుగుతోంది. గోవధ నిషేధం పూర్తిగా అమలు చేయాలి అని కోరుకునే వారిలో మొట్టమొదటి సంస్థ. ప్రపంచంలొనే ప్రసిద్ధిగాంచిన ఆమోదించబడ్డ సంస్థ మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసి ధార్మిక సంస్థ "దారుల్ ఉలూమ్ దేవ్ బంద్" మరియు "జమియతే ఉలెమా -ఏ- హింద్" బక్రీద్ సందర్భంగా ఎవరూ ఆవులను ఖుర్బాని ఇవ్వరాదని "ఫత్వా" జారీ చేయడం జరిగింది. ఇతర మతస్తుల మనోభావాలను గౌరవించాలని వారు పూజించే ఆరాధించే వాటిని ఖుర్బాని ఇవ్వకూడదని ఫత్వాలొ వివరించడం జరిగిందని అప్పటి నుండి ఏ ముస్లిం ఆవును ఖుర్బాని ఇవ్వడం లేదు అనేది వాస్తవం. కానీ కొంత మంది దీనికి భిన్నంగా అనుమతి పొందిన ఇతర జంతువులు ఎద్దులు. ఒంటెలను బలవంతంగా. లాక్కోవడం వాటిని గోశాలకు తరలించి గోరక్షకుల ముసుగులో గోభక్షకులుగా తయారై గోప్యంగా రాత్రికి రాత్తి కబేళాకు తరలించి లక్షలు దోచుకొవడం జరుగుతోందనేది అక్షర సత్యం. దీని ద్వారా నష్టపొయేది పేద రైతులు .వ్యవసాయానికి పనికిరాని . పాలు ఇవ్వలేని జంతువులను పొషించలేక కళ్ళముందు వాటి చావు చూడలేక ఆర్థిక పరిస్థితులు సహకరించక, రైతులు వాటిని విక్రయిస్తున్నారు. దీనికి ప్రభుత్వాలు ప్రత్యాన్మయం చూపాల్సింది పోయి వారే మతఛాందస ఉన్మాదులను రెచ్చగొట్టి రైతుల కడుపుకొట్టడమే కాక మతపరమైన విద్వేషాలు సృష్టించడం జరుగుతోంది . వాస్తవానికి మన దేశంలో వున్న బీఫ్ ఎగుమతి దారులలో ప్రముఖమైన అతి పెద్ద స్లాటర్హౌస్ కబేళాలు అన్నీ బీజేపీ సంబంధిత హిందువులవే అన్న విషయం వాస్తవం చాలామంది ప్రజలకు తెలియదు. అందులొ ముఖ్యమైనవి అల్ కబీర్. అల్ అనామ్.ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వున్నాయి. స్వయానా దేశ ప్రధాని ఒక సభలో గర్వంగా చెప్పారు ఏషియాలొనే బీఫ్ ఎక్స్‌పోర్టులో మన దేశం ముందు వరుసలో వుందని...ప్రభుత్వాలు ఒకపక్క గోవధనిషేదం పేరుతొ అమాయక హిందూ యువత ను రెచ్చగొట్టి ఇంకొ వైపు వారి అనుచరులతొ విదేశాలకు ఎగుమతి చేయించి రూ.కోట్లు గడించడం జరుగుతోంది...చివరిగా వీరి ప్రవర్తన ఎలావుందంటే ఒక వైపు పొగత్రాగటం ప్రాణానికి హానికరమని. మద్యం సేవించడం హానికరమని ప్రచారాలకు కోట్లు ఖర్చు చేస్తూ అటువంటి వాటిని తాగమని వాటికి అనుమతులిస్తున్నట్లుంది. అధికారంలో ఉన్నవారు తలుచుకుంటే ఏమైనా చేయొచ్చని చెప్పే పాలకులు గోమాంస ఎగుమతులు ఎందుకు నిలుపలేక పొతున్నారు. ప్రాణానికి హానికరమైన .ధూమపానాన్ని. మద్యం ను , పర్యావరణానికి ప్లాస్టిక్‌తో ముప్పని తెలిసి వాటి తయారీకి అనుమతులు ఎందుకు ఆపడం లేదు. ఇది అర్థం కాని ప్రశ్న గా మిగిలిపోయింది. ప్రజలు ఇప్పటికైనా కుటిల రాజకీయ నాయకుల మోసాలను గ్రహించాలని కోరుతూ చిన్న ప్రయత్నం...

"గోవధ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సహకరించాలి"
"పరమత సహనం పాటించాలి" సర్వేజనా సుఖినోభవంతు... జై హింద్

- దేశ ఆర్థిక వ్యవస్థ కు తోడ్పాటునిచ్చే గొప్ప అవకాశం బక్రీద్ పండుగ"
- ప్రతి సంవత్సరం 3 కోట్ల మందికి పైగా ముస్లిం లు మన దేశంలో బక్రీద్ సందర్భంగా "ఖుర్బాని" పాటిస్తారు
- ఖుర్బాని ఇచ్చే జంతువు సగటు ధర కనీసం 25,000 నిర్ణయించినా ఏటా బక్రీద్ పండుగ ఖుర్బాని మహత్తర కార్యం ద్వారా రైతులకు ఏడు లక్షల యాభై వేల కోట్ల రూపాయలకుపైన ఆదాయం లభిస్తుంది.
- బక్రీద్ పండుగలో ఖుర్బాని ద్వారా రైతుల ఆత్మహత్యలు కొంతమేరకైనా ఆపవచ్చు
- ఏటా కనీసం 30 లక్షల రైతు కుటుంబాలకు ఆర్థికంగా లబ్ది ని,ఆదాయాన్ని చేకూర్చే మార్గం "బక్రీద్"పండుగ
- ఎకనామిక్ పాయింట్ ఆఫ్ వ్యూవ్ లొ చూస్తే 98 శాతం రైతులు హిందూ సొదరులే ఈ ఖుర్బాని ద్వారా అత్యధికంగా లబ్ది పొందేది హిందువులే
- 100% మన భారతదేశ గ్రామీణ ప్రాంతాల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంది.
- మైనారిటీ నాయకులు,"మొహసినె కాయనాత్" ఫౌండేషన్ వ్యవస్థాపకులు..ఎన్. ఆరిఫ్ అలి.. 9885404140

MOHHSIN E KAAYENAAT FOUNDATION
N.ARIF ALI- 9885404140
KADIRI, ANANTAPURAM Dist, A.P.

**బక్రీద్ శుభాకాంక్షలు**
**సూర్య వాస్తవం పాఠకులకు, ప్రకటనకర్తలకు, ప్రజలకు, అధికారులకు, అనధికారులకు, ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు...**
**చైర్మెన్ & రీజనల్ మేనేజర్**
**సూర్య వాస్తవం దినపత్రిక**

సూర్య వాస్తవం

సోమవారం 17-06-2024

# ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు బక్రీద్ శుభాకాంక్షలు



అమరావతి సూర్యా వాస్తవం: స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచే యడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశం అని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని, పండుగ సందర్భంగా ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్ పండుగని స్ఫూర్తిగా తీసుకుని సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దాం అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# గోలి రాఘవ తిరుమలగిరి నుండి తిరుమల తిరుపతి వరకు పాదయాత్ర



జగ్గయ్యపేట,సూర్యా వాస్తవం: కేంద్రం లో నరేంద్ర మోడీ సారధ్యంలో మూడవ సారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం అలాగే రాష్ట్రం లో చంద్రబాబు నాయుడు సారధ్యంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆటకంలేకుండా పరిపాలన సాగాలని చేసిన దేశ శ్రేయస్సు కోరుతూ జగ్గయ్యపేట పట్టణ బిజెపి అధ్యక్షుడు గోలి రాఘవ ఆదివారం తిరుమలగిరి నుండి తిరుమల తిరుపతి వరకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోని పూజల అనంతరం పాదయాత్ర చేపట్టారు. జగ్గయ్యపేట అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, జిల్లా కోర్ కమిటి సభ్యుడు కీసర రాంబాబు, అసెంబ్లీ ఇంచార్జ్ కోల్లి నాగేశ్వరరావు, అసెంబ్లీ కో కన్వీనర్ బోర్డు మల్లికారజునరావు, జిల్లా ఓబిసి ప్రదాన కార్యదర్శి కల్లూరి శ్రీవాణి తదితరులు మాట్లాడుతు రాఘవ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జీల్లా కోర్ కమిటి సభ్యుడు కీసర రాంబాబు, జల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అసెంబ్లీ ఇన్చార్జి కొల్లి నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి వారి నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్




మైలవరం, సూర్యా వాస్తవం: మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆరేపల్లి వారి నూతన వస్త్రాలంకరణ వేడుకలలో పాల్గొన్నారు. మైలవరం మండలంలోని పొందుగల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్ ఆరేపల్లి గోపాలరావు కుమార్తె, చిన్నారి మేఘన నూతన వస్త్రాలంకరణ వేడుకలు ఆదివారం మధ్యాహ్నం వారి నివాసంలో జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, చిన్నారి మేఘనను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాకూటమి విజయంతో అన్నదానం

## -పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

మైలవరం, సూర్యా వాస్తవం: ఎన్డీఏ మహాకూటమి విజయోత్సవ వేడుకలు మైలవరం నియోజకవర్గంలో కన్నులపండువగా జరుగుతున్నాయి. మహాకూటమి శ్రేణుల ఆహ్వానాల మేరకు ఈ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు.ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాదు కి ఘనస్వాగతం లభించింది. పూలను వెదజల్లుతూ ఆయన్ని మహాకూటమి శ్రేణులు స్వాగతించారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కుటుంబ సభ్యులు, జనసైనికులు, వీరమహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ టీడీపీ నూతన అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్

## -ప్రకటించిన జాతీయ అధ్యక్షులు చంద్రబాబు



అమరావతీ, సూర్య వాస్తవం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీడీపీ నూతన అధ్యక్షునిగా పల్లా శ్రీనివాస్ యాదవ్ ని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నియమించారు. ఉత్తరాంధ్రకి చెందిన బీసీ నేతకు, చంద్రబాబు కీలక బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు అధ్యక్షులుగా ఉన్న అచ్చెన్నాయుడు పార్టీ అధ్యక్షుడుగా ఎన్నో సేవలు చేశారని, ప్రతిపక్ష నాయకుల నుండి ఒత్తిళ్లు, అవమానాలు సైతం లెక్క చేయకుండా, పార్టీకోసం కష్టపడ్డారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర నుండే అత్యధిక మెజారిటీ తో గెలుపొందిన పల్లా శ్రీనివాస్ యాదవ్ కూడా ప్రతి పక్ష నేతలు ఎన్ని ఇబ్బందులు పెట్టిన, తట్టుకుని, పార్టీ గెలుపుకోసం కష్టపడిన తీరును బట్టి నేడు ఈ అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

# టిడిపి నాయకుడు "వర్మ" జన్మదిన వేడుకలు




ఇబ్రహీంపట్నం, సూర్యా వాస్తవం: ఇబ్రహీంపట్నం మండలంలో తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకుడిగా పేరుగాంచిన టీడీపీ నేత వర్మ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ నాయకుడిగా స్థానికంగా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఆయన రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు.ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ,మానవ సేవే మాధవసేవ అని ప్రజశ్రేయస్సు కై అనుక్షణం ప్రజా సేవ చేస్తూ ఉండే ఆయన జన్మదిన వేడుకలలో భారీ ఎత్తున అభిమానులు,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొని ఫెర్రీ లోని ఆయన స్వగృహం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ కు చేరుకుని బాణాసంచా కాల్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆయన కేక్ కట్ చేసి అభిమానులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ఆయన అభిమానులు, తెదేపా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వరకు పాదయాత్ర



జగ్గయ్యపేట, సూర్యా వాస్తవం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, కుటమి పార్లమెంట్ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం ఉదయం జగ్గయ్యపేట పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్ వద్ద గల శ్రీ స్వయంభు విఘ్నేశ్వరస్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వరకు స్థానిక కూటమి మహిళలతో, కార్యకర్తలతో కలిసి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), సతీమణి శ్రీరాం శ్రీదేవి, శ్రీరాం చిన్నబాబు సతీమణి శ్రీవల్లి పాదయాత్ర చేసి మొక్కును తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



Truth of News

సూర్య వాస్తవం

http://www.suryavastavam.com

అమరావతి

గుంటూరు, ఉమ్మడి కృష్ణా

# మూడు వారాల్లో అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తాం

మొదటి పేజీ తరువాయి

రాయితీగా ప్రభుత్వమే భరించడం జరిగిందన్నారు. రోజుకి 2.25 లక్షల మంది అన్నా క్యాంటీన్ల ద్వారా భోజనం చేసే వారని, తమ హయాంలో మొత్తం మీద 4 కోట్లు 60 లక్షల 31 వేల 600 ప్లేట్ల భోజన్నాన్ని అన్నా క్యాంటీన్ల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. తొలుత మున్సిఫల్ ప్రాంతాల్లో ఈ అన్నా క్యాంటీన్లు పెట్టడం జరిగిందని, ఆ క్యాంటీన్లకు ప్రజల ఆధరణ ఎంతగానో ఉండటాన్ని గమనించిన చాలా మంది శాసన సభ్యులు గ్రామీణ ప్రాంతాలో కూడా అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రిని కోరగా, గ్రామీణ ప్రాంతాలకు కూడా మరో 150 అన్నా క్యాంటీన్లను ముంజూరు చేయడం జరిగిందన్నారు. పెద్ద ఎత్తున ప్రజల ఆధరణను పొందిన అన్నా క్యాంటీన్లను మళ్లీ పునరుద్ధరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదంతో త్వరలోనే చర్యలు చేపట్టనున్న ఆయన తెలిపారు.

# కేన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

నివారణకై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడంతో పాటు కేన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి ముందస్తు వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతో దాదాపు 5 కోట్ల 30 లక్షల మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేయడం జరిగిందన్నారు. ఇందుకై ఇంటింటి సర్వే నిర్వహించేందుకు అవసరమైన శిక్షణను ఏ.ఎన్.ఎం.లు, ఆషాలు ఇతర అంబాసిడర్లకు హోమీ బాబా కేన్సర్ ఇన్ స్టిట్యూట్ ద్వారా ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. రాష్ట్రంలో కేన్సర్ వ్యాధి నియంత్రణకు ఆరోగ్యశ్రీ పథకం క్రింద గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.600 కోట్లను వెచ్చినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 18 సంవత్సరాల లోపు విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం క్రింద రాష్ట్రంలోని 18 సంవత్సరాలలోపు విద్యార్థులు అందరికీ స్క్రీనింగ్ చేసే ఫైల్ పై మరో సంతకం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో యువత పెద్ద ఎత్తున గంజాయి, డ్రగ్స్ వినియోగిస్తూ వాటికి బానిసలు అవుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా డ్రగ్స్ కు బానిసలు అయిన యువతలో మార్పుతెచ్చేందుకు డిఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అత్యంత ప్రధాన మైన ఆరోగ్య రంగాన్ని గత ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ తో పాటు పలు కేంద్ర ప్రాయోజిక పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటు వంటి వాటా ఇవ్వకుండా వచ్చిన నిధులను కూడా దారి మళ్లించడం జరిగిందని ఆయన విమర్శించారు. ఈ విషయంలో కోర్టులు మొట్టికాయలు మొట్టినా, కేంద్రం పెనాల్టీ వేసిని గత ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్య దోరణిలో వ్యవహరించిందన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని కూడా నీరుగార్చే విధంగా అమలు పర్చారన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకోకుండా అనుబంద ఆసుపత్రులను అభివృద్ధి పర్చకుండా, మౌలిక వసతలు కల్పించ కుండా తొందరపాటు చర్యగా రాష్ట్రంలో వైద్య కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎంతో చిత్తశుద్ధి, జవాబుదారీతనంతో పనిచేసే ప్రభుత్వాలు వచ్చాయని, ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ప్రభుత్వాలు పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధికి తద్వారా దేశాభివృద్ధి శక్తి వంచ లేకుండా కృషిచేస్తాయని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో అన్ని స్థాయిలోని అధికారులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 10.20 గంటల సమయంలో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖ మంత్రిగా సత్యకుమార్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. అమరావతి సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో ఆయనకు కేటాయించిన ఛాంబరులో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఎంతో ఘనంగా రాష్ట్ర మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా భాద్యతలు చేపట్టేందుకు సతీసమేతంగా రాష్ట్ర సచివాలయానికి విచ్చేసిన ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతోను అధికారులు పుష్పగుచ్ఛాలతోను ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా.నరశింహారావు, ఏపి ఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర రెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్టు సి.ఇ.ఓ. లక్ష్మీషా, ఆరోగ్య విశ్వవిద్యాలయం వి.సి. బాబ్జీ, రిజిస్ట్రారు రాధికా రెడ్డి తదితరులతో పాటు పలువురు అధికారులు, అనధికారులు మంత్రికి పుష్పగుచ్చాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు.

# రెండో రోజూ నారా లోకేష్ "ప్రజాదర్బార్"

ఇప్పించాలని జగదీష్ అనే విద్యార్థి కోరారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సేవలను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని సిబ్బంది కోరారు. నులకపేట ఎంపీయూపీ ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యా బోధనకు అనుమతి ఇవ్వాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు యువనేత దష్టికి తీసుకువచ్చారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఐదు నెలల తన మేనల్లుడికి వైద్యసాయం అందించాలని మంగళగిరికి చెందిన షేక్ నజీనా కోరారు. డిగ్రీ, ఎంబీయే పూర్తిచేసిన తనకు, తన సోదరికి ఉద్యోగాలు కల్పించాలని తాడేపల్లికి చెందిన కే.కిరణ్ బాబు, కే.మౌనిక విజ్ఞప్తి చేశారు. వికలాంగుడినైన తనకు 40 ఏళ్లు వచ్చినా ఉద్యోగం రాలేదని, గత ప్రభుత్వంలో నష్టపోయానని, జీవనోపాధి కల్పించాలని తాడేపల్లికి చెందిన బి.శ్రీనివాసరావు లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. శాశ్వత నివాసం లేనందున తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వడ్డేశ్వరం రాధారంగా నగర్ కు చెందిన యర్రంశెట్టి సీతారాములు, బొంతల మారుతీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అంగన్ వాడీ హెల్పర్ గా పనిచేస్తున్న తనకు ధర్నా చేశామనే నెపంతో గత ప్రభుత్వం ప్రమోషన్ నిలిపివేసిందని, ఇప్పించాలని ఉండవల్లికి చెందిన కొలనుకొండ రాజేశ్వరి లోకేష్ ను కలిసి కోరారు. ఎయిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగం కల్పించాలని మంగళగిరికి చెందిన పెదపూడి మర్తమ్మ విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను విన్న లోకేష్.. పరిష్కారానికి కృషిచేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే

## -వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, (సూర్య వాస్తవం): ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా సుమారు 180 నుంచి 200 ఫుడ్ శాంపిల్స్ లను టెస్టులు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లు, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారుదారులు లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ -2006 ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ అన్ వీల్స్ (ఫుడ్ లాబ్స్), ఆకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులను నిరంతరం నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. మనం తీసుకునే ఆహారం నాణ్యత లోపం ఉంటే అనారోగ్య సమస్యలు మన దరికి చేరుతాయి. ఇటీవల కాలంలో ఎక్కువగా భోజనప్రియులు బయటి హోటల్, రెస్టారెంట్లలో భుజించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నటువంటి పరిస్థితి. అయితే భోజనం ప్రియుల ఆదరణకు నోచుకుంటున్న పలు హోటల్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శభాష్ అనిపించుకుంటూ ఉండగా, మరికొన్ని హోటల్, రెస్టారెంట్ల యాజమాన్యాలు మాత్రం ఫ్రిజ్ లలో ఆహార పదార్థాలను నిల్వ ఉంచుతూ భోజన ప్రియులకు అందిస్తున్న తీరును అరికట్టేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

# మాకేం సంబంధం లేదు

## -రిటైర్డ్ ఇంజనీర్లతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం

హైదరాబాద్, (సూర్య వాస్తవం): కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నాటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కర్త, కర్మ, క్రియ అని రిటైర్డ్ ఇంజనీర్లు తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజ్‌ను కేసీఆర్ సూచించారని.. తమ్మిడిహట్టి వద్ద ప్రపోజ్ చేసినా దాన్ని పక్కకు పడేశారని ఇంజనీర్లు వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 2015లో వేసిన అనంతరాములు కమిటీలోని రిటైర్డ్ ఇంజనీర్లతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి కీలకమైన సమాచారాన్ని అందించారు. అనంతరాములు కమిటీ రిపోర్టును పట్టించుకోలేదని అన్నారు. రిపోర్టును అప్పటి ఇరిగేషన్ మినిస్టర్ హరీష్ రావు కేసీఆర్‌కు అందించినా తాను సంతకం చేయకుండా ఓ మూలన పడేశారని వాపోయారు. అనంతరం జస్టిస్ ఘోష్ స్పందించారు. తాను పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. విచారణకు రాకపోతే తనకు ఏం చేయాలో తెలుసన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమైన ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టులోని సబ్ క్రాంటాక్ట్ వ్యవస్థపై ఆరా తీశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీల అకౌంట్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ పరిశీలించే యోచనలో ఉన్నారు. వీటితో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి డేటా తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఆ అకౌంట్ల లెక్కలు చూస్తే అసలు విషయం బయట పడుతుందని.. ఎంత మొత్తం చేతులు మారాయనేదానిపై స్పష్టత వస్తుందన్నారు.ఇప్పటివరకు 10 నుంచి 15 సబ్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారని ఘోష్ నేతృత్వంలోని కమిషన్ వాటి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఇప్పటికే అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కమిషన్.. అవి పరిశీలించాక అవసరమైతే సీడబ్ల్యూసీ వారిని పిలుస్తామన్నారు ఘోష్. ఇక ఏఈఈ, డీఈఈలను విచారించాలా లేదా అనేదానిపై తర్వాత తెలుపుతామన్నారు. ప్రస్తుతానికి ఇంజనీర్లతో సమావేశం ముగిసిందని అఫిడవిట్లు వచ్చాకే తదుపరి విచారణ అంటూ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ స్పష్టం చేశారు.

# తమిళనాడులో అమానుష ఘటన

**కులాంతర వివాహం జరిపించారని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంపై దాడి**

తిరునెల్వేలి, (సూర్య వాస్తవం): కులాంతర వివాహం జరిపించిన సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంపై అమ్మాయి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ ఘటన తమిళనాడులోని తిరునెల్వేలిలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా - మార్క్సిస్ట్ కార్యాలయంలో చోటు చేసుకుంది. జూన్ 13వ తేదీన వివాహం చేసుకున్న వివిధ కులాలకు చెందిన యువ జంటకు మార్క్సిస్ట్ పార్టీ మద్దతు ఇవ్వడాన్ని అమ్మాయి కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో.. పార్టీ కార్యాలయంతో పాటు, ఇద్దరు కార్యకర్తలపై దాడి చేశారు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కులాంతర వివాహం చేయడానికి పార్టీ సహాయం చేసినందున, తిరునెల్వేలిలోని పార్టీ కార్యాలయాన్ని కొంతమంది అగ్రవర్ణాల వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారని సీపీఐ(ఎం) తమిళనాడు విభాగం ఆరోపించింది. పార్టీ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, మదన్ కుమార్ (28), ఉదయ దాక్షాయిణి (23) అనే నూతన వధువరులు.. జూన్ 13న సీపీఐ(ఎం), అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ సహాయంతో ఇంటి నుండి పారిపోయి వచ్చి వివాహం చేసుకున్నారు. అమ్మాయి దాక్షాయిణి అగ్రవర్ణానికి చెందినది కాగా.. మదన్ ఎస్సీ వర్గానికి చెందినవాడు. శుక్రవారం తమ వివాహాన్ని రిజిస్టర్ చేసుకునేందుకు దంపతులు రిజిస్ట్రార్ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. అయితే దాక్షాయిణి కుటుంబ సభ్యులు వివాహాన్ని నమోదు చేయకుండా ఆపడానికి ప్రయత్నించారు. దీంతో.. దంపతులు స్థానిక సీపీఐ(ఎం) యూనిట్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో.. 25 మందికి పైగా దాక్షాయిణి కుటుంబ సభ్యులు జిల్లా కమిటీ కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్‌తో సహా పలు వస్తువులను ధ్వంసం చేశారు. విధ్వంసాన్ని ఆపడానికి ప్రయత్నించిన ఇద్దరు పార్టీ కార్యకర్తలపై దాడి చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. తిరునెల్వేలికి చెందిన సీనియర్ పోలీసు అధికారి మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో సమస్యను పరిష్కరించడానికి సీపీఐ(ఎం) స్థానిక యూనిట్ ప్రయత్నించిందని తెలిపారు. అయినప్పటికీ దాక్షాయిణి కుటుంబ సభ్యులు పార్టీ కార్యాలయానికి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేశారని తెలిపారు. కాగా.. ఈ ఘటనపై సమాచారం అందుకుని.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాక్షాయిణి తల్లిదండ్రులతో సహా 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరికొంత మంది నిందితుల కోసం వెతుకుతున్నామని.. ఈ ఘటనపై విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు. మరోవైపు.. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అంతేకాకుండా.. కులాంతర దంపతులకు రక్షణ కల్పించాలని పార్టీ కోరింది.

# విద్యార్థుల జీవితాలతో మోడీ చెలగాటం

## -ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను

శ్రీకాకుళం, (సూర్య వాస్తవం): విద్యార్థుల జీవితాలతో ప్రధాని నరేంద్ర మోడీ చెలగాటమాడుతున్నారని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను అన్నారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలతో ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోయారని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమాజానికి, విద్యారంగానికి తీవ్ర నష్టం చేసే జాతీయ విద్యా విధానాన్ని తెరపైకి తెచ్చింది మోడీ ప్రభుత్వమేనని విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడలోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీలో ముఖ్య అతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. సమావేశం ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాను మాట్లాడుతూ దేశ ప్రజలకు బిజెపి మతోన్మాదం నుంచి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడనున్నాయని చెప్పారు. అయోధ్యలో రామమందిరం మీద ఉన్న శ్రద్ధ దేశంలో ఉన్న నిరుద్యోగ విద్యార్థి, యువజనులపై ఉంటే దేశ ప్రగతి కొంతమేరైనా సాధ్యపడే దన్నారు. యువతకు రెండు కోట్ల ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అయోధ్య రామ మందిరం పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా, అయోధ్యలోని పైజాబాద్ నియోజకవర్గ ప్రజలు సైతం తిరస్కరించారని తెలిపారు. విద్యారంగంలో సైతం కాషాయీకరణ చొప్పించి కలుషితం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. 400 స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పారన్నారు. దేశం సర్వసత్తాక సౌమ్యవాద గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య దేశంగా పరిఢవిల్లాలంటే అది కేవలం విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందుకనుగుణంగా విద్యార్థులు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినా పాలకుల విధానాలు మారవని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్య, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పన, వసతిగృహ విద్యార్థుల సమస్యలపై పోరాటానికి కార్యాచరణ అమలు చేసి ఒక ప్రణాళిక ప్రకారం పోరాడాలని కోరారు. స్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని నూతన విద్యా విధానాన్ని ఎపిలోనే అమలు చేయడం ద్వారా గత ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణతా శాతం దారుణంగా పడిపోయిందన్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాలు, ఆనర్స్ కోర్సుకు ప్రవేశాలు వంటి కొత్త విధానాలు తీసుకురావడం వల్ల విద్యార్థులు తీవ్ర వ్యయప్రయాసలకు లోనవుతున్నారని చెప్పారు. సెల్ఫ్ ÷నాన్స్ డే కోర్సులు తీసుకురావడం వల్ల డిగ్రీ చదువుపై విద్యార్థుల ఆసక్తి తగ్గిందన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలను సరిచేయడంతో పాటు విద్యారంగం సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన టిడిపి, ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్.జె నాయుడు, వెంకటేష్, కిరణ్ పరమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తదితరులు పాల్గన్నారు.

# కోడెలపై పెట్టిన కేసునే జగన్‌పైనా పెట్టాలి

అమరావతి (సూర్య వాస్తవం): ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఫర్నీచర్‌ను సొంతానికి వినియోగించు కుంటున్న మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు చేయాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం ఓ ప్రకటనలో కోరారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆరోజు ఫర్నీచర్ తన వద్ద ఉందని చెప్పకపోతే ఎవరికీ తెలియదు. ఫర్నీచర్ తీసుకెళ్లాలని స్పీకర్‌కు లేఖ రాసిన తర్వాత ఆయనపై కేసు పెట్టారు. అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఐపీసీ 409 సెక్షన్ కింద పదేళ్లు శిక్షపడే కేసు పెట్టారు. అదే జగన్ నేడు.. తాడేపల్లి, లోటస్‌పాండ్‌లో ఇళ్ల మరమ్మతుల కోసం రూ.18 కోట్లు ఖర్చు చేశారు. ప్రజలను కలవటానికి చంద్రబాబు ఏర్పాటు చేసిన ప్రజావేదిక కూల్చి వేశారు. ప్రస్తుతం జగన్ తన నివాసంలో సీఎంవో కింద తెచ్చిన ఫర్నీచర్ ఇచ్చేస్తానని కనీసం లేఖ రాయలేదు. ఇప్పటిదాక ఫర్నీచర్ ఇవ్వనందుకు కోడెలపై పెట్టిన కేసే జగన్ మీద పెట్టొచ్చు కదా!' అని ప్రకటనలో పేర్కొన్నారు.

# సత్యదేవుడిని దర్శించుకున్న హోంమంత్రి అనిత

అన్నవరం (సూర్య వాస్తవం): రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సత్య దేవుడిని దర్శించుకున్నారు హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా రత్నగిరి కొండపైకి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రికి దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనితకు వేద ఆశీస్సులు నిర్వహించి స్వామివారి జ్ఞాపికను అమ్మవారి పట్టు వస్త్రాలను ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ మంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మండల, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల కూల్చివేతపై బీజేపీ హర్షం

హైదరాబాద్ (సూర్య వాస్తవం): జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి మాతాజీ నగర్ ఎఫ్ టీ ఎల్ స్థలంలో వెలసిన అక్రమ కట్టడాలు కూల్చి వేయడం పట్ల బీజేపీ సీనియర్ నాయకుడు నందు హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వ స్థలం కాపాడడం కోసం చేస్తున్న తమ పోరాటం ఎట్టకేలకు ఫలించిందని అన్నారు. జీహెచ్ఎంసి అధికారులు బేగంపేట్ ఎఫ్టీఎల్ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన సందర్భంగా బీజేపీ నాయకుడు నందు మాట్లాడుతూ భూ బకాసూరులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టి అమాయకులకు అమ్ముకుంటూ వాటికి ఇంటి నెంబర్లు, కరెంట్ మీటర్లు సైతం కల్పిస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదే విషయంపై రెండుసార్లు ఆర్ టీ ఐ వేసిన ప్రభుత్వం నుండి సమాధానం రాలేదని చెప్పారు. సర్వే నెంబర్. 194/8/1 దాదాపు ఆరు వందల కోట్ల విలువ చేసే 10ఎకరాల 20గుంటల స్థలాన్ని స్వాహా చేయడంలో అధికారులు, గత పరభుత్వ అధినేతల హస్తం కూడా ఉందని ఆరోపించారు. ఆ స్థలాలను కొన్న వారు తాము చెల్లించిన డబ్బులు నష్టపోయి ఇప్పుడు బాధితులుగా మారారని వెల్లడించారు. వారు తమ మొరను ప్రజాభవన్ ఆవరణలోనే వెళ్ళబోసుకున్నారని, అంతే కాకుండా ప్రజాప్రతినిధులకు వారిచ్చిన డబ్బుల గురించి కూడా చెబుతుండడం గమనార్హమని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పార్కును, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఇంటి నెంబర్లను, కరెంట్ మీటర్లను కేటాయింపులపై విచారణ జరిపి సంబంధిత అవినీతి అధికారులపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ (సూర్య వాస్తవం): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నేడు 2వ వార్డు పరిధిలోని రసూల్ పుర సిల్వర్ కంపెనీ, నారాయణ జోపిడి ప్రాంతలలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులను పరిశీలించారు.. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి వారి సాధకబాధలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను విడతల వారీగా నెరవేరుస్తానని, నాపై నమ్మకంతో గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులోఉంటానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సహకారంతో డబుల్ బెడ్ రూమ్ లో పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేసి లబ్దిదారులకు కేటాయింపులు చేస్తాం అని వెల్లడించారు. ఆశావర్కర్లు శ్రీ గణేష్ ను కలసి తమ సమస్యలను గురించి వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని వారికి హామీనిచ్చారు.

# గెలుపోటములు సహజం.. ఎవరు అధైర్య పడొద్దు

## వైస్సార్సీపీ కార్యకర్తలకి మనో ధైర్యాన్ని నింపిన జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దాసరి శశికాంత్ రెడ్డి

తొండూరు, సూర్య వాస్తవం :పార్టీ శ్రేణులు ఎవరు అధైర్య పడొద్దు. పార్టీ ఓడిపోయింది అని మనం గెలవలేకపోయాం అని నిరాశ వద్దు. ఏ పార్టీకైనా గెలుపోటములు సహజం ఓ వైపు రాష్ట్రంలో ఈవీఎం ల విషయం లో ఎం జరిగిందో మేధావులు చెబుతూనే ఉన్నారు జగన్ మోహన్ రెడ్డి ఈ ఐదేళ్లు ఓపిక పట్టమని దిశ నిర్దేశం చేసారని వైకాపా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దాసరి శశికాంత్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు పత్రికాముఖంగా తెలియజేస్తూ ఇకనుంచి అయినా ప్రజల్లో ఉంటూ మన పార్టీ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇప్పటికి మన ఓట్ బ్యాంకు మనకి ఉంది ఎవరు అధైర్యపడవద్దు ప్రతి కార్యకర్తని కలుస్తానని జగనన్న హామీ ఇచ్చారు. మన వైస్సార్సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని భయపడొద్దు, చట్టాలున్నాయి మన పార్టీ లీగల్ టీంలను సంప్రదించండి. ఏ ఒక్క కార్యకర్తకి ఇబ్బంది వచ్చిన పార్టీ శ్రేణులంతా ఏకమై అండగా నిలుద్దాం. పోరాడితే పోయేదేమీలేదు. మన నాయుడుకి మనమే దైర్యం. ఎన్ని కష్టాలైనా భరిస్తాం. 2029లో మళ్లీ జగన్నను సీఎంగా చూస్తాం ఇప్పటినుంచి కిందిస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. ఇది ప్రజలకోసం పుట్టిన పార్టీ అని మరోసారి నిరూపిద్దాం. ప్రతి సమస్యను దైర్యంగా ఎదుర్కోవాలి. ఏ కార్యకర్తకు కష్టం వచ్చిన నేను ఉన్నాను అని జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాటను గుర్తు పెట్టుకోండి. కొన్ని వర్గాల్లో గవర్నమెంట్ ఎంప్లాయిస్, వచ్చిన అసంతృప్తి ని జగన్ మోహన్ రెడ్డి వరకు పోనియ్యకుండా ద్వితీయ శ్రేణి నాయకులూ జగనన్న కోటరీ అడ్డుకున్నారు .దీని వలన పార్టీ బలహీన పడింది అని పార్టీ శ్రేణుల్లో సర్వత్రా వినపడుతున్న మాట. టీడీపీ ప్రభుత్వం రాగానే దాడులకు పాల్పడడం ద్వారా ప్రజలకు ఎం సందేశం ఇస్తున్నారు. ఈ రకమైన చర్యలకు పాలపడడం సమంజషంగాదు. గెలుపోటములకు అతీతంగా ప్రజల్లోకి వెళ్లగలిగినవాళ్ళే నిజమైన నాయకులు అని అన్నారు.

# చురుగ్గా కదులుతున్న రుతుపవనాలు

## తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలకు అవకాశం

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్,(సూర్య వాస్తవం): వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు వాతావరణశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా చురుగ్గా ఉన్నాయని పేర్కొంది. దీనితోపాటు రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా.. మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి ఉందని తెలిపింది. ఈ రెండింటి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షాలు పడవచ్చని తెలిపింది. హైదరాబాద్ ?లోనూ వర్షాలు పడతాయని తెలిపింది. మరోవైపు నిన్న రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నిన్న ఉరుములు.. మెరుపులతో కూడిన వర్షం పడింది. భారీగా వీచిన ఈదురుగాలులకు చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేములవాడ రాజన్న ఆలయం ఎదుట రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భద్రాచలం కొత్తగూడెం జిల్లాలోనూ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. భద్రాచలంలో 5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దాంతో రామాలయం వద్ద ఉన్న అన్నదాన సత్రం చుట్టూ నీళ్లు చేరి చెరువును తలపించింది. నిన్న ఒక్కరోజే కురిసిన వర్షానికి స్లూయిస్ బ్రేక్ అవ్వడంతో అన్నదాన సత్రంలోకి నీళ్లు చేరాయి.

# కూటమి ప్రభుత్వానికి ముందున్న అనేక సవాళ్లు..

కడప సూర్య వాస్తవం బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. పదేళ్లు గడిచినా రాజధాని లేని రాష్ట్రం. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే చేయాల్సిన దుస్థితి. ఉపాధి చూపిస్తే తామే డబ్బులు సంపాదించుకుంటామని ఎదురుచూసే నిరుద్యోగులు, పనుల కోసం తపిస్తున్న కార్మికులు, ఇలా కోటి ఆశలతో ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వం వైపు చూస్తున్నారు. ప్రభుత్వ పాలన అంటే కేవలం సంక్షేమ పథకాలు అమలు చేస్తే సరిపోదని, తమ స్థానిక అవసరాలు తీర్చడంతో పాటు ఉపాధి కల్పనపై కూడా దృష్టి పెట్టాలని తీర్పు చెప్పిన ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెద్ద బాధ్యతనే పెట్టారని చెప్పక తప్పదు. ఏపీ ప్రజలకు రాజధాని విషయంలో స్పష్టత లేకుండానే పదేళ్లు గడిచిపోయాయి. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో చంద్రబాబు తలపెట్టిన అమరావతి నిర్మాణంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం రూ. 24 వేల కోట్ల రెవెన్యూలోటు, రూ. 55,817 కోట్ల ద్రవ్యలోటు ఉన్న పరిస్థితుల్లో రాజ ధానికి నిధులు సమకూర్చడం కూటమి ప్రభుత్వం ముందున్న పెద్ద సవాల్‌గా చెప్పవచ్చు. అయితే, కేంద్రంలో సీఎం చంద్రబాబుకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా రాష్ట్రానికి నిధుల కొరత ఉండబోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అమరావతిలో రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థలు, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సదుపాయాలు వంటి వాటి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అమరావతికి ఒక రూపం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు పాలనాపరమైన శాశ్వత భవనాలు, ఉద్యోగుల ఇళ్ల సముదాయాలు వెనువెంటనే పూర్తి చేయడం ద్వారా రాజధాని అభివృద్ధిలో వేగం పెంచవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన:**

ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన మరో ప్రధాన హామీ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన. రాష్ట్రంలో గత పదేళ్లలో ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగ కల్పన మినహా ఐటీ, టెలికాం, ఫార్మా, సెమీకండక్టర్ రంగాల్లో ఉద్యోగాల సృష్టి ఆశించిన స్థాయిలో జరగలేదన్నది వాస్తవం. ఏపీలో డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన యువత ఉద్యోగాల కోసం పక్కరాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకై ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి ఉపాధి కల్పనతోపాటు యువతలో నైపుణ్యాల పెంపుదల రాష్ట్ర సమ్మిళిత అభివృద్ధిలో కీలకంగా నిలుస్తాయి. వృత్తి విద్యా కోర్సుల్లో బోధన శిక్షణ ఏకకాలంలో జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటి బూమింగ్ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానించి 'ఇండస్ట్రియల్ నీడ్స్' పై యువతకు శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఉంది. తద్వారా విద్యార్థి దశలోనే వారిలో నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్, సామర్థ్యాలు పెంచవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత:**

ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. కీలకమైన ఎర్త్కమ్ రాక్ఫిల్డ్యామ్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కొట్టుకుపోయిన డయా ఫ్రమ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సివుంది. ఆర్ %డ%ఆర్ పూర్తి కావాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా పారిశ్రామిక - వ్యవ సాయ రంగాల్లో గణనీయమైన వృద్ధి సాధించ
దంతోపాటు ప్రభుత్వానికి ప్రజలకు సంపద సృష్టి జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ధరల నియంత్రణ.. ఆదాయ మార్గాల పెంపు:**

రాష్ట్రంలో ధరల పెరుగుదల లేకుండా ప్రభుత్వ ఆదాయ మార్గాల ను పెంచుకోవడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో యూజర్ ఛార్జీల భారం, విద్యుత్ ఛార్జీల మోత, నీటి పన్నులు, చెత్తపన్నులు, నిర్మాణాల ఆధారంగా కాకుండా ఆస్తి మూలధన విలువ ఆధారంగా విధిస్తున్న పన్నులు ప్రజలకు తలకుమించిన భారంగా మారాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పన్నుల భారాన్ని తగ్గిస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జగనన్న కాలనీలు పూర్తి చేయడం, మూలన పడ్డ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడానికి చర్యలు తీసుకోవాల్సి **ఉంది.**

**సూపర్ సిక్స్ హామీలపై ఎదురు చూపు..**

మరోవైపు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు, అమ్మకు వందనం పథకం కింద చదువుకునే విద్యార్థులకు 15 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 లాంటి సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజల ఆశగా ఎదురు చూస్తున్నారు.

# వైసీపీ అరాచకాలకు తగిన గుణపాఠం చెప్పిన ప్రజలు



ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): వైసీపీ అరాచకాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని టిడిపి రాష్ట్ర నాయకులు సీఎం సురేష్ నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డు లోని పిఎన్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి, వారి ఎమ్మెల్యే లు ఐదు సంవత్సరాలు చేసిన అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఓటమి పాలయ్యాక ఈవీఎంలు ట్యాంపరింగ్ అని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గౌరవప్రదంగా మాట్లాడే విధానం నేర్చుకోవాలని సూచించారు. ఇప్పుడు జరగబోయే పరిపాలనలో ఏవిధంగా క్రికెట్ బుకీల పరిస్థితి ఉంటుందో చేసి చూపిస్తామని, ఎంత మాత్రం కాపాడుతారో చూడాల్సి వుందన్నారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి ప్రతిరోజు 5000 మందికి తాను భోజనం పెట్టానని, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కూడా రాజన్న క్యాంటీన్ ద్వారా రోజుకు 2000 మందికి అన్నదానం కొనసాగిస్తానని చెప్పి ప్రజల ఓట్లు దండుకోవడానికి డ్రామాలాడారని, తమ ప్రభుత్వం తరపున అన్నా క్యాంటీన్ త్వరలోనే మొదలు పెడతామని, రెండు మూడు రోజుల్లో ప్రజలకు గతంలో మున్సిపాలిటీ స్థలంలో వున్న రాజన్న భోజనం మొదలు పెట్టాలని, లేని పక్షంలో అక్కడే తాము అన్నా కాంటీన్ ఏర్పాటు చేసి ప్రజలకు భోజనమందిస్తామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వానికి సపోర్ట్ చేసిన పోలీసు అధికారులను, రెవెన్యూ అధికారులను వదిలిపెట్టమన్నారు. శివపార్వతుల సాక్షిగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రాజన్న క్యాంటీన్ మొదలు పెట్టాలని కోరారు. ప్రజలు టిడిపి, బిజెపి, జనసేన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలని, తన తమ్ముడు రమేష్ నాయుడుని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు సహకరించిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన అన్ని హామీలు నెరవేరుస్తారు అన్న నమ్మకం ప్రజలకు, తమకు ఉందన్నారు. రాచమల్లు ప్రసాద్ రెడ్డి అబద్ధపు వాగ్దానాలు పది సంవత్సరాలు ప్రజల చూశారని , దేవుని సాక్షిగా, తల్లిదండ్రుల సాక్షిగా అంటూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎన్నో ప్రమాణాలు చేశారని, ప్రొద్దుటూరులో టిడిపి గెలిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలుగుతానని అన్నారని, ఎప్పుడు రాజకీయ సన్యాసం చేస్తావో చెప్పాలని కోరారు. దేవాలయాలకు, మసీదులకు, కళ్యాణమండపాలకు చందాలిస్తానని చెప్పి పనులు మొదలు పెట్టించారని, అవి ప్పుడు పూర్తి చేస్తావో చెప్పాలని, చేయలేని పక్షంలో తామే ప్రభుత్వ నిధులతో పూర్తి చేయిస్తామని వివరించారు. టిడిపి నాయకులు కామిశెట్టి బాబు మాట్లాడుతూ ప్రజలు జగన్ పాలనతో విసిగి కూటమికి అధికారాన్ని కట్టబెట్టారన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, ప్రజలు జగన్ మాకొద్దు ు చంద్రబాబు ముద్దు అని తీర్మానించారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# అనంత మేయర్ మహమ్మద్ వసీంకు అరుదైన అవకాశం

## -21న రష్యాలో జరిగే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు ఆహ్వానం



అనంతపురం క్రైం (సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీంకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 21న రష్యాలోని జరిగే వివిధ దేశాలకు సంబంధించిన మేయర్ల సదస్సుకు ఆయనకు ఆహ్వానం అందింది. బ్రిక్స్ దేశాల అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగే సదస్సుకు కజాన్ మేయర్ నుంచి అనంతపురం మేయర్ కు పిలుపు వచ్చింది. ఈ సమావేశానికి వివిధ దేశాలకు చెందిన సుమారు 50 మందికి పైగా మేయర్లు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అనంతపురం నగర మేయర్ వసీంకు మాత్రమే సదస్సులో పాల్గొనడానికి అవకాశం దక్కింది. రాను పోను ప్రయాణంతో పాటు అక్కడ బస చేయడానికి ఇతర అన్ని సౌకర్యాలను రష్యా ప్రభుత్వమే భరించనుంది. **అనంత మేయర్ కు మాత్రమే ఆ అవకాశం ఎందుకంటే..** అనంతపురానికి రష్యాతో ఉన్న చారిత్రాత్మక అనుబంధం వల్లే అనంతపురం మేయర్ వసీంను ఎంపిక చేశారు. 16వ శతాబ్దంలో ప్రథమ రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు సంబంధించిన అంశాలు ఇటీవల కజాన్ లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో అనంతపురం ప్రాధాన్యతను గుర్తు చేశారు. అందుకే భారతదేశ నుంచి పింక్ సిటీగా గుర్తింపు పొందిన జైపూర్, క్యాలీకట్, త్రిశూర్, నాగర్ కోయిల్ తో పాటు అనంతపురం నగరాన్ని ప్రాతిపదికన తీసుకొని నగర ప్రథమ పౌరుడు అయిన మేయర్ కు ఆహ్వానం పంపారు. ఎప్పుడో 16వ శతాబ్దంలో అనంతపురాన్ని సందర్శించిన రష్యన్ యాత్రికుని రచనలను పరిగణలోకి తీసుకొని అనంతపురం నగరం ఎంపిక చేయడం విశేషం. ఇలాంటి అవకాశాలతో చిరకాల సంబంధాలు, సంస్కృతి సాంప్రదాయాల మరింత బలపడనున్నాయి. రష్యాలో జరిగే సమావేశానికి అనంతపురం నుంచి మేయర్ వెళుతుండడంతో అంతర్జాతీయ స్థాయిలో అనంతపురానికి మరింత గుర్తింపు లభించినట్లు అయింది. రష్యన్ ప్రభుత్వము అనంతపురం నగరాన్ని గుర్తించిందంటే అనంతపురం ప్రజలు గర్వంగా ఫీలవుతున్నట్లు మేయర్ వసీం తెలిపారు.

# నదులను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉంది

శ్రీకాకుళం (సూర్య వాస్తవం): నదులను దేవతలుగా కొలిచే సాంప్రదాయం మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో అనాధి నుంచి వస్తుందని... నదులను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని... శ్రీకాకుళం నగర వాసులకు దాహార్తిని తీర్చే నాగావళి నది పరిరక్షణ కు ముందుకు వస్తున్న యువతకు సలాం చెబుతున్నామని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో హయతి నగరం ఒడ్డున నాగావళి నది పరిశుభ్రత కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు... మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మరియు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు.. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ బృహత్తర యజ్ఞంలో శ్రామికుల వలే పనిచేశారు. విడతల వారీగా నదిని శుభ్రపరుస్తూ... స్వచ్ఛ శ్రీకాకుళం స్థాపనలో బాగస్వామ్యం అవుతున్నారు.. నదులు సమృద్ధిగా నీటి సరఫరా చేస్తూ... మనుషులకు.. జంతువులకు రైతులకు కావలసిన త్రాగునీరు.. సాగునీరు అందిస్తాయని అన్నారు.. నదిని కలుషితం కాకుండా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు... శ్రీకాకుళం నగర ప్రజలు చెత్తను.. ఇతర వ్యర్థ పదార్థాలను నదిలో వేయకుండా.. ఇంటికి వొచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని లేదా వీధిల్లో ఏర్పాటు చేసే చెత్త కుండీల్లో వేయాలని ఆయన సూచించారు.. శ్రీకాకుళం నగరాన్ని సుందర నగరం గా తీర్చిదిద్దే పనిలో పడ్డామని దీనికి ప్రజలు సంపూర్ణ సహకారాన్ని అందించాలని మున్సిపల్ హెల్త్ అధికారి సూచించారు... ఒక యువకుని మదిలో వొచ్చిన ఆలోచన కు సామాజిక మీడియా లో చూసి నగర వాసులు అంతా కలిసి కట్టుగా ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్ సాసపు జోగినాయుడు గోలీ ఉమా మహేశ్వర రావు డాక్టర్ జీఎన్.. రావు టీడీపీ నేత.. తోలేటి వెంకన్న యాదవ్ ఐతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం అధికారులు.. ఆచార్య విష్ణుమూర్తి డాక్టర్ బలరాం... హాల్లో సిక్కోలు ప్రతినిధులు పి. ప్రశాంత్.. మధు.. తదితరులు పాల్గొన్నారు.

Truth of News సూర్య వాస్తవం http://www.suryavastavam.com

# రాయలసీమ

## కడప, అనంతపురం, చిత్తూరు

# గండి క్షేత్రంలో కమలాపురం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

## శాశ్వత అన్నదానానికి విరాళం



చక్రాయ పేట, సూర్య వాస్తవం : చక్రాయ పేట మండలం శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానం, గండి క్షేత్రములో ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, వారి కుటుంబ సభ్యులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి ఆలయ మర్యాదలతో దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటంతో పాటు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభిమాని కమలాపురం పట్టణ వాస్తవ్యులు పాలగిరి సుబ్బారెడ్డి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 1,00,116 విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవి చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ ఎంపీ నాగరాజు ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ యువ నాయకులు



అనంతపురం క్రైం (సూర్యవాస్తవం) : కర్నూల్ పార్లమెంట్ టిడిపి ఎంపీ గ ఎన్నికైన పంచలింగాల నాగరాజును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు టిడిపి యువ నాయకులు పర్ల శ్రీకాంత్, పొక్కు నరేష్. ఈ సందర్భంగా కర్నూల్ ఎంపీ బస్తీపాటీ నాగరాజు మాట్లాడుతూ నా విజయానికి తోడ్పడిన కర్నూల్ పార్లమెంట్ ప్రజానాకానికి, టిడిపి ,జనసేన, బీజేపీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మధు ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు



కడప సూర్య వాస్తవం : కమలాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి విజయం సాధించడంతో నియోజ కవర్గంలోని 17వడివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ అల్పాహార విందు కార్యక్రమంలో డివిజన్లోని నాయకులే కాకుండా పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయంపై తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మామిళ్లపల్లె పంచాయతీగా ఉన్న కాలం నుంచి తెలుగుదేశం పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని గతంలో మామిళ్లపల్లె పంచాయతీ ఉప సర్పంచ్గా తెలుగుదేశం పార్టీ తరపున విధులు నిర్వహించారని వెల్లడించారు. మామిళ్లపల్లె కార్పొరేషన్లో విలీనమైన తరువాత పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం స్థానికంగా ఉన్న నాయకులతో కలిసి విజయం కోసం అహర్నిశలు పోరాటం చేశామన్నారు. జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో యువ నాయకుడు కృష్ణ చైతన్యరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మా ప్రాంతాల్లోని సమస్యలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళతామని భవిష్యత్లో పార్టీకి తిరుగులేకుండా న్యాయం చేస్తామని వివరించారు. ఈ విందు కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహులు, గుత్తి గోపాల్యాదవ్, సాంబశివారెడ్డి,వెంకటరమణ, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ ఏపీ సెట్ ఎంట్రెన్స్‌లో శ్రీవిద్యా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: ఏపీ ఈ ఏపీ సెట్ ఎంట్రెన్స్ ఫలితాలలో స్థానిక స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీ విద్య జూనియర్ కళాశాల విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కె.ఓ.వి. రమణారావు తెలిపారు. ఈ ఏపీ సెట్ ఇంజనీరింగ్ విభాగంలో పి.వి. స్పందన 5608వ ర్యాంకు, కార్తీక్ శర్మ 13380వ ర్యాంక్, తేజేశ్వరరెడ్డి 15906వ ర్యాంక్, అలాగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో వై. హరిణి 6517, అలీమా సుహానా 9961, రిషిత వైష్ణవీ 16025 ర్యాంక్ లతో సత్తా చాటారని వివరించారు. వీరందరిని ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్ కుమార్ రెడ్డి, రామమోహన్‌లు అభినందించారు.

# పార్టీల కతీతంగా పనిచేశా

## – రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి



రాజంపేట, సూర్య వాస్తవం: తాను రాజంపేట పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సందర్భంలో పార్టీలకతీతంగా పనిచేశానని, అదేవిధంగా ప్రభుత్వం లేకున్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక విలేకరుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజలు చూపించిన అభిమానం మరువనని ముఖ్యంగా తన గెలుపునకు సహరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని మిథున్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం లేకున్నా వైసిపి కార్యకర్తలు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని అదేవిధంగా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గుండె నిబ్బరంతో పార్టీకి సేవలు అందించాలని ఆత్మస్థైర్యంతో పార్టీకి పనిచేయాలని అన్నారు. గెలుపు ఓటములను సర్వసాధారణంగా తీసుకొని కక్ష సాధింపులు మాని, అభివృద్ధి సాధించాలని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పుల్లంపేట సీనియర్ నాయకులు ముద్దా బాబుల్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి , చెవ్వు శ్రీనివాస్ రెడ్డి, పర్వతం విజయ్ కుమార్ రెడ్డి, వడ్డి అన్నపూర్ణ తో పాటు సర్పంచులు దార్ల చంద్రశేఖర్ , ఆనాల చెంగల్రెడ్డి, యజ్ఞం చంద్రశేఖర్, నాయిని హరికృష్ణా రెడ్డి,ముప్పాల హేమనవర్మ ,అన్వర్ భాష, కోడూరు మస్తాన్, షఫీ వైయస్ కరిముల్లా, మజీద్, యామల రాజా, కొప్పల శంకరయ్య, దొంతి రెడ్డి రాజారెడ్డి, కృష్ణారెడ్డి వినోద్, రమణారెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎంపీజే ఆధ్వర్యంలో జాగృతి ఉద్యమం



ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: విద్యాలయాల్లో మరియు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఎంపీజే ఆధ్వర్యంలో జాగృతి ఉద్యమం నిర్వహించనున్నామని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు సంబంధించిన సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విద్యాలయాల్లో మరియు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు జూన్ 15 నుండి జులై 15 వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ఎంపీజే శాఖ ఆధ్వర్యంలో విద్య జాగృతి ఉద్యమం నిర్వహించబోతుందని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా యంపిజే క్యాడర్ రాష్ట్రంలోని విద్యాలయాల్లో, వసతి గృహాలలో మరియు విద్యకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేలా ప్రయత్నం చేస్తోందని తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009 ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదని, గత రెండు సంవత్సరాల క్రితం హైకోర్టు చీవాట్లు పెట్టిన ప్రైవేటు విద్యసంస్థలలో పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చిన డబ్బులు కట్టక పోవడంతో విద్యార్థుల తల్లితండ్రుల దగ్గర వసూలు చేసిన విద్యా సంస్థలు. పూర్తి సమగ్రంగా దీన్ని అమలు చెయ్యాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎడ్యుకేషనల్ పాలసీని వెనక్కి తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే 'తల్లికి వందనం' అర్హులైన పేద విద్యార్థులకు అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఆపిన మైనార్టీల స్కాలర్ షిప్స్ లను పునః ప్రారంభించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు ప్రభుత్వం ఇస్తున్న రిజర్వేషన్లు అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముస్లింలకు ఇస్తున్న బీసీ- ఈ రిజర్వేషన్లలను కొనసాగిస్తూ..ఇతర మైనారిటీలకు కూడా వర్తింపజెయ్యాలని, అంగన్వాడీ మరియు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లలో అవసరమైన మౌళిక వసతులను కల్పించాలని, విద్యాభ్యాసం మధ్యలో ఆపిన విద్యార్థినీ, విద్యార్థులను స్కూల్లలో చేర్పించెందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 43వేల 355 వందల టీచర్ల పోస్టులకు గాను 16, 347 పోస్టులను భర్తీ చేయనున్న ప్రభుత్వం, మిగిలిన పోస్టులకు కూడా నోటిఫికేషన్ లో కలపాలని, విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు నాణ్యత కల్గిన "స్టూడెంట్స్ కిట్స్" అందించాలని, మాస్ కాపీయింగ్ మరియు అవకతవకలు జరిగిన నీట్ పరిక్షలను కేంద్ర ప్రభుత్వం మాజీ సుప్రీం కోర్టు జడ్జి ద్వారా ఎంక్వైరి చేపట్టి త్వరగా తిరిగి పరిక్షలు నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం నూతన విద్య పాలసీలో భాగంగా మూడు నుండి ఇంటర్మీడియట్ వరకు కలిపి చదివించే జీవో 117ని రద్దు చెయ్యాలని, నూతన ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలను ఏర్పాటు చెయ్యాలని, నూతన మెడికల్ కాలేజిలలో నాణ్యత కలిగిన ప్రొఫెసర్ లను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ప్రైవేటు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలలో విద్యార్థులకు నాణ్యత గల విద్య అందించలేని మరియు మెరుగైన వసతులు కల్పించడంలొ విఫలమైన కళాశాలల రిజిస్ట్రేషన్ లను రద్దుచేయాలని, ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని బయటకు వస్తున్న నిరుద్యోగులను ఉద్యోగ భద్రత లేదా జీవనోపాధికి ప్రభుత్వం చొరవ చూపాలని, రాష్ట్రంలో పూర్తి స్థాయిలో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనను ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని, గత ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యాలయాలలో నాడు- నేడు లో జరిగిన అభివృద్ధిని ఇంకా మెరుగైన సౌకర్యాలతో నూతన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని, కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రజలపై వేస్తున్న ఫీజులను ప్రభుత్వం నియంత్రించాలని, ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముస్లిం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష, ఉపాధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ అస్లం పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానము



బద్వేల్, సూర్య వాస్తవం: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 2023 -2024 విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు దాతల ద్వారా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు బహుమతి, మహనీయుల ఫోటో జ్ఞాపిక, పెన్నుల ప్యాకెట్టు, ప్రశంసాపత్రము పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బద్వేల్ గురుమూర్తి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా గోపవరం మండల విద్యాశాఖ అధికారి యన్.చెన్నయ్య, యోగివేమన యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు,మునిసిపల్ వైస్ ఛైర్మెన్ యర్రగొల్ల గోపాలస్వామి, శ్రీరామ ఛారిటబుల్ ట్రస్ట్ ఛేర్మెన్ శ్రీరామరాజు హాజరై విద్యార్థులకు బహుమతులు అందచేశారు.ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ బి.సి వసతి గృహాలలో ఉంటున్న పేద,బడుగు,బలహీనవర్గాల విద్యార్థులను ప్రోత్సహించుటలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు క్రమశిక్షణ,నైతిక విలువలు, భక్తి, శ్రద్దలతో,ఇష్టముతో, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగాలని,పూలే,అంబేద్కర్,అబ్దుల్ కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి జీవిత చరిత్రలు చదవి ఆచరించి ఉన్నత పొందాలని పిలుపునిచ్చారు. జిల్లా లోని బి.సి హాస్టల్లలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి వారికి, వసతి సౌకర్యాలు మెరుగుపరచడానికి జిల్లా అధికారులు, హాస్టల్ల సిబ్బంది కృషి చేయాలని,జిల్లాలో అరకొర వసతులతో అద్దె భవనాలలో వున్న బి.సి వసతి గృహాలకు పక్కాభవనాల నిర్మాణము,శిధిలావస్థలో వున్న భవనాలకు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మరియు హాస్టళ్లలో ఖాళీగా ఉన్న సిబ్బంది వెంటనే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం యం.ఈ.ఒ చెన్నయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారి యన్.ప్రసాద్,కమాటి వి.జగదీశం ల కు దుశ్శాలువాతో సన్మానించడమైనది. కార్యక్రమంలో బి.సి ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బరాయుడు,బి.సి సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్యు.వి రమణయాదవ్,ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వి సుబ్బారావు,బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ నానబాల వెంకటేశ్వర్లు,ఆవాజ్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షులు యస్.ఎ సత్తార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్ బాష బి.సి విద్యార్థి సంఘం నాయకులు వంగిమల్ల రీతేష్ కుమార్,బి.సి సంఘం నాయకులు బాలయ్య,హాస్టల్ వెల్ఫేర్ అధికారులు యన్.ప్రసాద్, సుభాష్చంద్ర,హరికృష్ణ,హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్లు లేక తప్పని తిప్పలు..!

## –ఇబ్బందులు పడుతున్న మహిళలు



దువ్వూరు,సూర్య వాస్తవం : మండల కేంద్రమైన దువ్వూరులో మరుగుదొడ్లు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఇది పేరుకే దువ్వూరు మండలం అని స్వచ్ఛభారత్ అంటే ఇదేనేమో అని ప్రజలు అంటున్నారు.మండల కేంద్రమైన దువ్వూరులో మరుగుదొడ్లు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. నిత్యం స్థానిక వాసులే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆఫీసు పనుల మీద ప్రయాణాల నిమిత్తం పనులపై వస్తుంటారు. మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. పురుషులైతే మూత్రంకు వెళ్లాలంటే ఏదో ఒక చోట చాటుచేసుకుని మూత్రం వదులుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. మరి మహిళల పరిస్థితి వర్ణనాతీతం. ఇప్పటికైనా మండల అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దువ్వూరులో మరుగుదొడ్లు నిర్మించి మండల ప్రజల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.మండల కేంద్రమైన దువ్వూరులో మరుగుదొడ్లు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అయ్యో..... వాలంటీర్లు

- ఇప్పుడు వారి పరిస్థితి ఏంటి...?
- మళ్లీ విధుల్లోకి తీసుకుంటారా....!?
- ప్రభుత్వం ఆదుకోకపోతే మా కుటుంబం పరిస్థితి ఏమిటి..... వాలంటీర్లు
- ఎమ్మెల్యే దగ్గుపాటి నీ కలిసిన వాలంటీర్లు






అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన ,బిజెపి కూటమి అఖండ మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వ హయాంలో నియమితులైనటువంటి గ్రామ వార్డు వాలంటీర్ల పరిస్థితి ఏంటి. గతంలో వాలంటీర్లు వైకాపాకు మద్దతుగా ఉన్నారని కూటమి ఎన్నోసార్లు విమర్శలు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో వారి స్థానం ఏంటి అనే పలు అంశాలపై ఆసక్తి నెలకొంది. ఇదే విషయంపై అనంతపురంలోని వాలంటీర్లు అనంతపురం అర్బన్ నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ను నగరంలోని వాలంటీర్లు ఆదివారం నాడు వెళ్లి కలిశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ వాలంటీర్ ఉద్యోగాలు తన చేతుల్లో ఉండదని ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ల ద్వారానే ఎన్నిక చేయబడుతుందని ఎమ్మెల్యే వారికి తెలియపరిచారన్నారు.. వాలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికలలో వాలంటీర్ల సేవలను ఉపయోగించుకునేందుకు మమ్మల్ని రాజీనామాలు చేయాలని తీవ్ర ఒత్తిడి చేశారనీ రాజీనామాలు చేసి వైసిపి అభ్యర్థుల కోసం పనిచేసిన వారినే మళ్ళీ తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలలోకి తీసుకుంటామని, రాజీనామాలు చేయనివారందరినీ తొలగించి ఇంటికి పంపేస్తామని వైసీపి నేతలు బెదిరించారన్నారు. వారి ఒత్తిళ్ళు భరించలేక మేము రాజీనామాలు చేశామన్నారు. వైసీపిని నమ్ముకొని ఉద్యోగాలకు రాజీనామాలు చేసి నష్టపోయామని వారు ఎమ్మెల్యే దగ్గర వాపోయారు. నామమాత్రపు జీతానికి 5 ఏళ్ళు వెట్టిచాకిరీ చేసి, వైసిపి నేతలతో నిత్యం అవమానాలు భరిస్తూ వైసిపి కోసం పనిచేస్తే చివరికి మా భవిష్యత్ ఈవిదంగా ఆగమ్యగోచరంగా మారిందనీ వారు తెలియజేశారు. కనుక తమను ఆదుకోవాలని వాలంటీర్లు విజ్ఞప్తి చేశారు. ఇది ఇలా ఉంటే టిడిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్లకు జీతాలు పెంచి నెలకు రూ.10,000 ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ ఇంతకాలం వైసీపికి వీరవిధేయంగా పనిచేసిన వాలంటీర్లను టిడిపి నమ్మగలదా? ఓ పక్క పార్టీలో లక్షల మంది టిడిపి, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎన్నో అడ్డుపోట్లు తట్టుకొని పార్టీలను నమ్ముకొని క్షేత్రస్థాయిలో పనిచేశారు వారిని కాకుండా అప్పటి ప్రభుత్వం వైసీపి కి విధేయులైన వాలంటీర్లను ఉద్యోగాలలో కొనసాగించాలని సీఎం అనుకున్నా టిడిపి, జనసేన, బిజెపి నేతలు అంగీకరిస్తారా? అంటే అనుమానమే మరి ఏది ఏమైనా వారి సమస్యకు పరిష్కారం తిరిగి ఉద్యోగంలో తీసుకోవడమా లేదా పక్కన పెడతారో వేచి చూడాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే వాలంటీర్ల, వారి కుటుంబాల పరిస్థితి ఏమిటి?

# కన్నుల కనువిందుగా వెంకటరమణుని కళ్యాణం

## – ఘనంగా 18వ వార్షికోత్సవం



వేముల ప్రతినిధి సూర్య వాస్తవం న్యూస్ : వేముల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి వెంకట రమణ స్వామి ఆలయంలో 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో శ్రీ పద్మావతి వెంకటరమణని కళ్యాణం కన్నుల కనువిందుగా ఆలయ ప్రధాన పద్మాలయ కిషోర్ తోటి సహాయ అర్చకులచే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన సంకల్పాలు తదితర పూజ కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చలపతి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో వేముల చుట్టుపక్కల ప్రాంత గ్రామాల నుండి ఎంతో నమ్మకంతో స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి సంవత్సరము జూన్ నెలలో 16వ తారీకు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందడం జరుగుతుందని అన్నారు, అనంతరం మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి భక్తులందరికీ అన్న ప్రసాదాలను అందజేశారు. వాటిలో భాగంగా సాయంకాల సమయాన మేలవాయిద్యాలు కోలాటాలతో స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# సినిమా

## దేవుడికి తలనీలాలు సమర్పించి, నాలుకపై శూలం గుచ్చుకుని..



పై ఫొటోలో గుండుతో కనిపిస్తున్న మహిళ ఎవరో గుర్తుపట్టారా? ఈమె ఒకప్పుడు తెలుగు, తమిళ్ సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. మరికొన్ని సినిమాల్లో సహాయ నటిగా ఆడియెన్స్ ను మెప్పించింది. ఈమె తెలుగులో హీరోయిన్ గా చేసింది ఒక్క సినిమానే. అయితేనేం యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. సినిమా కూడా సూపర్ హిట్ అయ్యింది. కానీ ఎందుకో తెలుగులో హీరోయిన్ గా కొనసాగలేకపోయింది. కొన్ని సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ తోనే సరిపెట్టుకుంది. కేవలం తమిళ్ సినిమాలకే పరిమితమైంది. మరి ఈ తార ఎవరో గుర్తు పట్టారా? కొంచెం కష్టంగా ఉంది కదా! అయితే సమాధానం మేమే చెబుదాం లెండి. ఈమె మరెవరో కాదు 10%ష్ట్ర% క్లాస్ హీరోయిన్ శరణ్య. తాజాగా ఆమె తమిళనాడు లోని ప్రముక దేవాలయం తిరుత్తని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంది. స్వామివారికి తలనీలాలు సమర్పించింది. అంతేగాకుండా నాలుకపై శూలం పొడిపించుకుని స్వామి వారికి మొక్కులు చెల్లించింది. ఇందుకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది శరణ్య. దీంతో అవి కాస్తా సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. సాధారణంగా అమ్మాయిలకు జుట్టు అంటే చాలా ఇష్టం. ఎంత పొడవుగా పెంచుకుంటే అంత అందంగా కనిపిస్తామన్నది వారి భావన. అందుకే మొక్కులు చెల్లించేటప్పుడు కూడా చాలామంది అమ్మాయిలు జస్ట్ మూడు కత్తెర్లు ఇస్తారు. కానీ శరణ్య మాత్రం తన కేశాలను పూర్తిగా స్వామివారికి మొక్కుగా చెల్లించింది. దీంతో అభిమానులు, నెటిజన్లు శరణ్యపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## ఆయనే వదిలేశారు..నేను కాదు.. రేణు దేశాయ్ కామెంట్..



రేణూ దేశాయ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్?గా ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఆమె అకీరా, ఆద్య గురించి చేసే పోస్టులు క్షణాల్లో వైరలవుతుంటా యి. నిత్యం తన ఫ్యామిలీ విషయాలతో పాటు.. జంతువుల సంరక్షణకు సంబంధించిన విషయాలను కూడా పోస్ట్ చేస్తుంటారు. అయితే ఆమె ప్రతి పోస్ట్ పై పవన్ ఫ్యాన్స్ రియాక్ట్ అవుతుంటా రు. తాజాగా రేణు దేశాయ్ తన ఇంట్లో జరిపిన పండుగ, హెూమం గురించి చెప్పింది. తానే తన చేతులతో ప్రసాదం చేశానని.. ఇలా ప్రత్యేక పూజలు చేసిన ప్పుడు తన చేత్తో ప్రాసంద చేయడం అంటే ఇష్టమని రేణూ దేశాయ్ చెప్పుకొచ్చింది. అయితే ఆమె షేర్ చేసిన వీడియో పై పవన్ ఫ్యాన్స్ రియాక్ట్ అయ్యారు. అయితే ఓ నెటిజన్ రియాక్ట్ అవుతూ 'వదినగారు మీరు కొన్ని ఇయర్స్ ఓపిక పట్టుంటే బాగుండేది. ఒక దేవుడ్ని పెళ్లి చేసుకుని ఆయన అంతరంగం తెలియకుండా వెళ్లిపోయారు. కానీ ఈరోజు ఆయన విలువ మీకు తెలిసింది. ఏది ఏమైనా విధి అంతా డిసైడ్ చేస్తుంది. ఈరోజు పిల్లలు అన్నయ్యతో ఉన్నారు చాలా వదిన మిమ్మల్ని మిస్ అవుతున్నాం' అంటూ కామెంట్ చేశాడు. అందుకు రేణూ దేశాయ్ రియాక్ట్ అవుతూ మీకు కొంచమైనా బుద్ధి ఉంటే ఇలా అనేవారు కాదు.. ఆయన వదిలేసి ఇంకో పెళ్లి చేసుకున్నారు. నేను కాదు.. దయచేసి నన్ను ఇంకా టార్చర్ చేయద్దు. ఇలాంటి కామెంట్స్ పెట్టి అని దండం పెట్టేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్స్ షేర్ చేస్తున్నారు నెటిజన్స్. ఇంకో నెటిజన్ సూపర్ అమ్మ మీరు.. అన్న దగ్గర లేకపోయినా బాగా పూజలు చేస్తున్నారు అని ఇంకో మహానుభావుడు కామెంట్ చేశాడు. ఆ కామెంట్ కు రేణూ దేశాయ్ ఫైర్ అయ్యారు. అన్న దగ్గర లేకపోయినా ? .. అంటే అర్థం ఏంటీ? నాకు నా సొంత లైఫ్ ఉండదా..? మీరు ఇలాంటి కామెంట్స్ పెట్టి నన్ను బాధపెడుతున్నారు రేణు దేశాయ్ ఆవేదన చెందారు.

## మహేష్ మేనకోడలిని చూశారా..?



మహేష్ బాబు సోదరి మంజుల ఘట్టమనేని ఫ్యామిలీకి సంబంధించిన కొన్ని ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. అందులో ఆమె కూతురు.. మహేష్ మేనకోడలు జాహ్నవి స్వరూప్ ఫోటోస్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకప్పు డు చిన్నారిగా కనిపించిన జాహ్నవి ఇప్పు డు అచ్చం హీరోయిన్ లా కనిపిస్తుంది. తల్లిదండ్రులతో కలిసి ట్రెడిషనల్ వేర్ లో ఎంతో అందంగా కనిపిస్తున్న జాహ్నవి ఫోటోస్ నెట్టింట వైరలవుతుండగా.. క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. మెన కోడళ్లు, మేనల్లుళ్లతో కలిస్తే మహేష్ చాలా చిన్న పిల్లాడిలా మారిపోయి వారితో ఎంజాయ్ చేస్తుంటాడు.మంజుల ఘట్టమనేని సినిమాల్లో కీలకపాత్రలు పోషించింది. ఆరెంజ్ సినిమాలో రామ్ చరణ్ అక్క, బావగా కనిపించారు మంజుల ఘట్టమనేని దంపతులు. కేవలం నటిగానే కాకుండా నిర్మాతగానూ రాణిస్తున్నారు. సొంతంగా ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసి పోకిరి సినిమాకు సహనిర్మాతగా వ్యవహరించారు. అలాగే అటు వ్యాపారరంగంలోనూ తమకంటూ మంచి స్థాయిని ఏర్పర్చుకున్నారు. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఫ్యామిలీ విషయాలను పంచుకుంటున్నారు.

# ఆరోగ్యం

## బాబోయ్.. బొప్పాయి ఆకులతో బోలెడు లాభాలున్నాయ్.. !



బొప్పాయి తింటే ఎంత రుచిగా ఉంటుందో ఆరోగ్యానికి కూడా అంతే మేలు చేస్తుంది. బొప్పాయిలో మన జీర్ణవ్యవస్థను పెంచే అన్ని రకాల పోషకాలు ఉన్నాయి. పచ్చి, పండిన బొప్పాయిలను ఆహారంలో ఉపయోగిస్తారు. బొప్పాయి మాదిరిగానే బొప్పాయి ఆకుల్లో కూడా ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బొప్పాయి ఆకు రసం తాగడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలకు ఔషధంలా పనిచేస్తుంది. బొప్పాయి ఆకు రసం తాగడం వల్ల శరీరానికి శక్తినిచ్చి అనేక రోగాలు నశిస్తాయి. బొప్పాయి ఆకులతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. బొప్పాయి ఆకులు అనేక వ్యాధులకు ఔషధంగా పనిచేస్తాయని పరిశోధనలు కూడా నిరూపించా యి. బొప్పాయి ఆకులలో శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించే పదార్థాలు ఉంటాయి. బొప్పాయి ఆకుల రసం చేదుగా ఉంటుంది. అందులో కాల్షియం, విటమిన్ ఏ, బీ, సీ, డీ, ఈ ఉంటాయి. ఈ రసం కోసం ఓ ఆకును కడిగి.. చిన్న చిన్న ముక్కలుగా చేసి మిక్సీలో వేసి.. కొద్దిగా నీరు పోసి పేస్టులా చేసుకోవాలి. తర్వాత ఫిల్టర్ చెయ్యాలి. ముఖ్యంగా డెంగ్యూలో బొప్పాయి ఆకులను ఎక్కువగా ఉపయోగిస్తారు. బొప్పాయి ఆకుల్లో యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్, యాంటీ డెంగ్యూ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యులు కూడా బొప్పాయి ఆకు రసం తాగాలని సూచిస్తున్నా రు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, బొప్పాయి ఆకు సారాన్ని తాగడం వల్ల శరీరాన్ని ఇనుములాగా బలపరుస్తుంది. వ్యాధులను కూడా దూరం చేస్తుంది. మలేరియా, డెంగ్యూ వంటి సమస్యలలో బొప్పాయి ఆకులను నీటిలో వేసి మరిగించి దాని సారాన్ని తీసి సేవించాలి. ఈ విధంగా బొప్పాయి సారం తాగడం వల్ల రోగిలో ప్లేట్ లెట్ కౌంట్, ఎర్ర రక్తకణాలు వేగంగా పెరుగుతాయి. అనేక ఆసియా దేశాలలో, బొప్పాయి ఆకులను బెరిబెరి అనే వ్యాధికి చికిత్స చేయడానికి కూడా ఉపయోగిస్తారు. బొప్పాయి ఆకులలో ఫ్లేవనాయిడ్లు, యాంక్లాయి డ్, అమైనో ఆమ్లాలు, లిపిడ్లు, కా ర్బోహైడ్రేట్లు, విటమిన్లు మరియు ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. బొప్పాయి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక రుగ్మతలు ఔషధం లేకుండా నయమవుతాయి. అయితే, దీనిని తీసుకునే ముందు ఆరోగ్య నిపుణులను సంప్రదించడం కూడా అవసరం. బొప్పాయి ఆకుల రసం ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచగలదు. తద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి బొప్పాయి ఆకుల రసం చక్కగా పని చేస్తుందని పరిశోధనలు తేల్చాయి. మహిళల్లో రుతుక్రమ సమస్యల్ని సరిచెయ్యడంలో బొప్పాయి ఆకుల రసం బాగా ఉపయోగపడుతుంది. శరీరంలో హార్మోన్లను ఇది క్రమబద్ధీకరిస్తుంది. జుట్టు రాలిపోవడం, జుట్టులో దురద, చుండ్రు, వెంట్రుకలు తెల్లబడటం వంటి సమస్యలు బొప్పాయి ఆకుల రసంతో పరిష్కరించబడుతుంది.

## సమ్మర్‌లో సబ్జా గింజలు తింటే ఏమవుతుందో తెలుసా..?



ఒకప్పుడు ఒంట్లో వేడి చేసిందంటే చాలు, ఎక్కువ మంది సబ్జా గింజలను నానబెట్టుకుని వాటిలో కలకండా వేసుకుని తాగేవారు. ఇప్పుడు చాలా మంది దాన్ని మరిపోయారు. కానీ ఈ వేసవిలో మన ఒంటికి చలవ చేసే పానీయాల్లో సబ్జా చాలా మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎండాకాలం అప్పుడే మండిపోతుంది. ఉదయం 10దాటితే చాలు మాడు పగిలిపోయే ఎండ దంచికొడుతుంది. దాంతో ఒంట్లో వేడి కూడా పెరిగిపోతుంది. వేసవి తాపాన్ని తట్టుకోలేక ప్రజలు, శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు, లెమన్ వాటర్, పుదీనా నీరు, మజ్జిగ వంటివి తరచూగా తీసుకుంటుంటారు.. అయితే, వేసవిలో చలువ చేసే మరో పదార్థం కూడా ఉంది. అదే సబ్జా గింజల పానీయం. ఒకప్పుడు ఒంట్లో వేడి చేసిందంటే చాలు, ఎక్కువ మంది సబ్జా గింజలను నానబెట్టుకుని వాటిలో కలకండా వేసుకుని తాగేవారు. ఇప్పుడు చాలా మంది దాన్ని మరిపోయారు. కానీ ఈ వేసవిలో మన ఒంటికి చలవ చేసే పానీయాల్లో సబ్జా చాలా మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో మన శరీరానికి హైడ్రేటెడ్ గా, చల్లగా ఉండాల్సిన అవసరం కూడా పెరుగుతోంది. వేసవిలో మన ఆరోగ్యం, శరీరం హైడ్రేటింగ్ యాంటీఆక్సిడెంట్-రిచ్ సీజనల్ పండ్లను తీసుకోవడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన కొన్ని విత్తనాలను తీసుకోవడం వల్ల కూడా మీ శరీరాన్ని చల్లబరుస్తుంది. అటువంటి విత్తనం సబ్జా లేదా తులసి గింజలు, వీటిని సాధారణంగా ఫలూడా గింజలు అని పిలుస్తారు. ఈ విత్తనాల్లో ప్రోటీన్లు, కీలకమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉన్నాయని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది మాత్రమే కాకుండా సబ్జా గింజల్లో ఉండే ప్రోటీన్ కంటెంట్ చియా విత్తనాల కంటే ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు లేని కారణంగా వాటిని ఆసియన్ సూపర్‌ఫుడ్ గా కూడా పరిగణిస్తున్నారు. ఈ గింజల్లో పీచు, శ్లేష్మం పుష్కలంగా ఉన్నందున, అవి "మలబద్ధకాన్ని తగ్గించడంలో ప్రేగు కదలికను ప్రోత్సహించడం, సంతృప్తిని కలిగించడం, మూత్రవిసర్జన, మూత్రపిండాలను నిర్విషీకరణ చేయడం, పిండిని రక్తంలో చక్కెరగా మార్చడం ద్వారా బరువు తగ్గడంలో చాలా సహాయకారిగా పనిచేస్తాయి.

# క్రీడలు

## సఫారీలపై సెంచరీతో చెలరేగిన స్మృతి మంధాన..

### దెబ్బకు రికార్డులు బద్దలు కొట్టిందిగా!



భారత్-దక్షిణాఫ్రికా మహిళల మధ్య జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన సెంచరీతో చెలరేగింది. బెంగళూరులోని ఎం చిన్నస్వామి వేదికగా జరుగుతోన్న ఈ మ్యాచ్ లో క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన స్మృతి 116 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో సెంచరీ పూర్తి చేసింది. ఓవరాల్ గా మొత్తం 127 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్ తో 117 పరుగులు చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధానకు ఇది 6వ సెంచరీ. ఈ సెంచరీ ఇన్నింగ్స్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి 7000 పరుగుల రికార్డు సృష్టించింది. భారత మహిళల జట్టులో ఈ ఘనత సాధించిన రెండో క్రీడాకారిణి కూడా. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టుకు శుభారంభం లభించలేదు. జట్టు స్కోరు 15 పరుగులకు చేరుకునే వరకు ఓపెనర్ షఫాలీ వర్మ (7 పరుగులు) వికెట్‌ను కోల్పోయింది. అనంతరం హేమలత కూడా 12 పరుగులకే పెవిలియన్ చేరింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 10 పరుగులకే నిష్క్రమించింది. దీంతో టీమిండియా కేవలం 53 పరుగులకే 3 ముఖ్యమైన వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇక్కడి నుంచి స్మృతికి జతకలిసిన జెమీమా రోడ్రిగ్స్ (17 పరుగులు) కాసేపు సహకారం అందించి జట్టు స్కోరు 90 దాటింది. ఈసారి సిక్సర్ కొట్టే ప్రయత్నంలో జెమీమా క్యాచ్ పట్టి ఔటైంది. అనంతరం వచ్చిన రిచా ఘోష్ 3 పరుగులకే తన ఇన్నింగ్స్ ముగించింది. దీంతో మరోసారి జట్టు కష్టాల్లో పడింది. కానీ 7వ స్థానంలో వచ్చిన దీప్తి శర్మ 37 పరుగుల ఇన్నింగ్స్ ఆడి స్మృతితో మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఆ తర్వాత స్మృతి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. 8వ ప్లేస్ లో వచ్చిన పూజ స్మృతికి బాగా సపోర్ట్ చేయడమే కాకుండా జట్టు స్కోరును డబుల్ సెంచరీ మార్కును దాటేసింది. వీరిద్దరి మధ్య 50 పరుగుల భాగస్వామ్యం కూడా ఏర్పడింది. ఈ సమయానికి, స్మృతి 93 పరుగుల వద్ద ఉంది. తరువాతి బంతికి ఒక భారీ సిక్సర్, సింగిల్‌ను కొట్టి తన సెంచరీని పూర్తి చేసింది. చివరికి 127 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో 117 పరుగులు చేసి స్మృతి తన వికెట్‌ను కోల్పోయింది. చివరకు భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసింది. దీంతో ఆఫ్రికా జట్టుకు 266 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.


## టీమ్‌ఇండియా కోచ్‌గా గంభీర్ ఫిక్స్

### ఆ డిమాండ్‌కు ఓకే చెప్పిన బీసీసీఐ



టీమ్‌ఇండియా కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ఈ టీ20 ప్రపంచకప్‌తో ముగుస్తుంది. జులై 1 నుంచి కొత్త కోచ్ బాధ్యతలు స్వీకరిస్తాడని బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొత్త కోచ్‌గా ఎవరొస్తారన్న దానిపై ఉత్కంఠ ఇంకా వీడటం లేదు. భారత జట్టు కోచ్ పదవికి మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతడి ఎంపిక దాదాపు ఖరారైనట్లు కొన్ని రోజుల నుంచి వార్తలొస్తున్నాయి. కొత్త కోచ్ నియమాకం గురించి జూన్ చివర్లో బీసీసీఐ అధికారిక ప్రకటన చేయనుంది. "భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉండటానికి గంభీర్‌తో చర్చలు జరిపాం. అతను టీ20 ప్రపంచ కప్ తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేస్తాడు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కోచ్‌గా ఉండటానికి బీసీసీఐ ముందు గంభీర్ ఓ డిమాండ్ ఉంచినట్లు వార్తలొస్తున్నాయి. సహాయక సిబ్బంది (సపోర్టింగ్ స్టాఫ్) నియామకం విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని షరతు పెట్టాడట. అందుకు బోర్డు అంగీకరించినట్లు సమాచారం. దీన్ని బట్టి గంభీర్ కోచ్‌గా వస్తే ప్రస్తుతమున్న సహాయక సిబ్బంది మొత్తం తప్పుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్‌గా పరాస్ మంబ్రే, ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ ఉన్నారు. గంభీర్ సహాయక సిబ్బందిలోనే కాకుండా జట్టులోనూ మార్పులు చేస్తాడట. "భారత జట్టుకు కోచ్‌గా ఉండాలని అనుకుంటున్నా. జాతీయ జట్టుకు శిక్షణ ఇవ్వడం కంటే గొప్ప గౌరవం మరొకటి ఉండదు. 140 మంది కోట్ల భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు లెక్క" అని గంభీర్ ఇటీవల ఓ కార్యక్రమంలో పేర్కొన్నాడు.

# ప్రజల నీటి కష్టాలను త్వరలోనే తీరుస్తాం



నంద్యాల జూన్ 16 (సూర్య వాస్తవం): నంద్యాల జిల్లా నంద్యాలలో ప్రజల నీటి కష్టాలను త్వరలోనే తీరుస్తామని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణం శివార్లలో మహానంది రోడ్డులో ఉన్న అమృత్ ఫేస్ వన్ పనులను, ఫిల్టర్ బెడ్ లను , సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమృత్ ఫేస్1 పనులను దాదాపు రూ 150 కోట్లతో అప్పటి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే దాదాపు 75% పనులు పూర్తి చేశామన్నారు. 2019 లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 25% పనులు కూడా చేయలేదన్నారు. ఇప్పుడు నేను మంత్రి బాధ్యతలు చేపట్టాను కాబట్టి అమృత్ ఫేస్ వన్ పథకం కింద పనులను పూర్తి చేసి వచ్చే నెల లోపల వెలుగోడు రిజర్వాయర్ నుండి పైపుల ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. నంద్యాల జిల్లా ఏర్పడింది కావున తాగునీటి అవసరాలు చాలా ఎక్కువగా ఉంటాయన్నారు. పట్టణ జనాభా పెరుగుతుంది కాబట్టి అలాగే అమృత్ ఫేస్ టు పథకాం ద్వారా గోరకల్ రిజర్వాయర్ నుండి పనులు కూడా పూర్తి చేపిస్తామన్నారు. రారున్న రోజుల్లో నంద్యాల పట్టణానికి ఎటువంటి తాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తానని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతోని నంద్యాల జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు.

## రుషికొండపై జగన్ రెడ్డి జల్సా ప్యాలెస్‌లో
# రూ.26 లక్షల బాత్ టబ్ ఇదే: టీడీపీ



విశాఖ జూన్ 16 (సూర్య వాస్తవం) :విశాఖలోని రుషికొండపై కట్టిన ప్యాలెస్ ను టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇవాళ లోకానికి చూపించిన సంగతి తెలిసిందే. ఆయన రుషికొండ భవనంలోని ప్రతి గదినీ పరిశీలించి, దానికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫొటోలను తెలుగుదేశం పార్టీ కూడా తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసింది. ముఖ్యంగా, ఒక పెద్ద ఇంటిని తలపించేలా ఉన్న బాత్రూం ఫొటోలను టీడీపీ షేర్ చేసింది. "రుషికొండ మీద రూ.500 కోట్లతో జగన్ రెడ్డి కట్టుకున్న జల్సా ప్యాలెస్ లోని రూ.26 లక్షల బాత్ టబ్ ఇదే. అధికారంలోకి వస్తే తన భార్యకు బీచ్ సైడ్ ప్యాలెస్ గిఫ్ట్ గా ఇస్తానని చెప్పి, ప్రభుత్వ సొమ్ముతో ఇలా విచ్చలవిడితనం చేశాడు. ఇంకా ఎన్ని ఘోరాలు బయటపడతాయో!" అంటూ టీడీపీ పేర్కొంది.